AL - HILAL

నెలవంక

మాస పత్రిక

Vol 7, Issue: 47 September - 2010 مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى



పండుగ ఆదేశాలు, ఆదాబులు

కాలుతున్న భూతల స్వర్గం

మూడు శతాబ్దాలు నిద్రించిన యువకులు

IPC
لجنة التعريف بالإسلام
ISLAMI PRESENTATION COMMITTEE
لجنة التعريف بالإسلام

ఉచితం

برعاية

الأمانة العامة للأوقاف



వీరి ఇస్లాం వినూత్న అధ్యాయానికి సంకేతం
...వీరి శిక్షణ మీ గురుతర బాధ్యత

వారిని ఇస్లాం వైపునకు ఆహ్వానించి మీ కర్తవ్యాన్ని నెరవేర్చండి

సౌకర్యాలను మేము కల్పిస్తాం... 14 వేర్వేరు భాషలలో వినూత్న సందేశ సాధనాలు (పుస్తకాలు, కరపత్రాలు, కేసెట్లు మొదలగునవి). వివిధ భాషలలో ప్రవీణులైన 75 మందికి పైగా ధర్మబోధకులు సదా మీ సేవలో ఉంటారు..... సర్వదా మా సేవలు సిద్ధం.

IPC

لجنة التعريف بالإسلام

ISLAM PRESENTATION COMMITTEE

جمعية النجاة الخيرية

22444117

... رحمة للعالمين

www.ipc-kw.com

Rawda 22511301 | Salmiya 25733263 | Sabahiya 23620332 | Khaitan 24711141 | Mangaf 23723002 | Jahra 24558830 | Shuhada 25231015 | Main Centre 22444117

సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 7, ISSUE: 47
SEPTEMBER 2010

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhammad Azeezur Rahman

EXECUTIVE EDITOR
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Sk. Habeebur Rahman Jamaee
Sk. Abdus Salam Omeri
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONES
M.Azeezur Rahman
66104547
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc-kw.com

DESIGN
Noushad Zainulabdeen

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....

దృక్పథం	2
ఈదుల్ ఫిత్ర్: చేయాల్సినవి...	3
పండుగ ఆదేశాలు	4
కశ్మీర్‌లో జరిగేదేమిటి?	6
ధర్మ సందేహాలు	9
పగవారి పన్నాగాలు	10
దేవుని అపురూప సృష్టి	11
ఇస్లాం శిక్షణ	12
మన గురువులు	13
గుహవారి గాథ	14
ఐపిసి వార్తలు	16
నేటి బాలలే రేపటి పౌరులు	17
షిర్క్ పుట్టు పూర్వోత్తరాలు	18
నా అన్వేషణ ఫలించింది	20



◄ كلمة العدد ◄ العيد ما لنا وما علينا ◄ أحكام العيد ◄ مسلمي كشمير
◄ نشيد (سمعنا وأطعنا) ◄ و جعلنا بينكم مودة ◄ والله خير الماكرين
◄ الفتاوى الشرعية ◄ تربية المهتدين ◄ نشيد (مكانة المربي) ◄ أصحاب الكهف
◄ أخبار اللجنة ◄ روضة الأطفال ◄ كيف بدأ الشرك ◄ قصة المهتدي

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ



నిత్య నూతన గ్రంథం ఖుర్‌ఆన్

దివ్య ఖుర్‌ఆన్

అవతరించిన మాసం రమజాన్ మన నుండి సెలవు తీసుకోవటానికి సిద్ధంగా ఉంది. ఈ మాసంలో ఉపవాసాలు పాటిస్తూ ఖుర్‌ఆన్‌ను పఠించినవారు, ఖుర్‌ఆన్ పఠనాన్ని శ్రద్ధతో ఆలకించిన వారు నిస్సందేహంగా అదృష్టవంతులు. అలాగే దివ్య ఖుర్‌ఆన్‌ను తమ జీవన సంవిధానంగా నమ్మినా దాని సూక్తులపై చింతన చేసినవారు, దాని ఆజ్ఞలను శిరసావహించినవారు, దాని సందేశాన్ని ఇతరులకు చేరవేసినవారు కూడా ధన్యులే.

యదార్థమేమిటంటే మానవుడు ఎంత బుద్ధిమంతుడైనప్పటికీ ఎన్నో విషయాలలో అతని బుద్ధి తికమక పడుతూ ఉంటుంది. తనకంటూ ఒక మార్గదర్శకుని కోసం అతని ఆంతర్యం ఆశగా ఎదురు చూస్తుంది. ఆ మార్గదర్శకుడు మానవ సహజమైన దౌర్బల్యాలన్నింటికీ అతీతుడై ఉండాలని కూడా అతని మైజం వెంఛిస్తుంది. సకల చరాచర లోకేశ్వరునికన్నా గొప్ప మార్గదర్శకుడు ఎవరు కాగలుగుతారు? ఆ లోకేశ్వరుడే మానవుని మార్గదర్శకత్వం నిమిత్తం తన గ్రంథాలను అవతరింపజేశాడు. ఆ గ్రంథాల సారాన్ని క్షుణ్ణంగా విడమరచి చెప్పే సందేశకోరులను, ప్రవక్తలను ప్రభవింపజేశాడు. ఆ గ్రంథ రాజాల పరంపరలోని చిట్టచివరి కృతియే దివ్యఖుర్‌ఆన్. ఆ ఉద్గ్రంథంలోని పలు ప్రథమాంశాలలో అత్యంత కీలకమైనది 'మానవ మార్గదర్శకత్వం'. ఇది "మానవులందరికీ మార్గదర్శకం" అని ఒక చోటుంటే (2: 185), "భయభక్తులు గలవారికి సన్మార్గ దర్శిని" అని మరొక చోట అనబడింది (2: 2). ఈ గ్రంథం సార్వజనీనం మాత్రమే కాదు, సర్వ కాలికం కూడా. నాటికీ, నేటికీ, మరెన్నటికీ ఇదే మానవతకు మోక్ష ప్రదాయిని. ఈ గ్రంథం గురించి అత్యంత సమగ్రమైన పరిచయం చేస్తూ ముహమ్మద్ (స) ఇలా అన్నారు:

"ఇది దైవ గ్రంథం. ఇందులో గతించిన వారి నిజ గాథలున్నాయి. భవిష్యత్తుకు సంబంధించిన వాఖ్యులున్నాయి. మీ జీవితాలకు సంబంధించిన ఆదేశాలున్నాయి. ఇదొక తిరుగులేని వాక్కు ఇందులో వేళాకోళపు విషయాలు లేవు. అహంకారంతో దీన్ని విడనాడిన వానిని దేవుడు తొక్కేస్తాడు. ఈ గ్రంథాన్ని వదలి పెట్టి వేరొక చోటి నుంచి సన్మార్గం పొందగోరినవానిని దేవుడు మార్గభ్రష్టునిజ్ఞి చేస్తాడు. ఇది దేవుని పటిష్టమైన త్రాడు. ఇది ఉపదేశంతో, వివేకంతో నిండిన వాక్కు ఇంకా ఇదే రుజుమార్గం. ఈ గ్రంథాన్ని ఆశ్రయించిన వారి కోర్కెలు పెడత్రోవ పట్టవు. దీని మూలముగా భాషలు మాసపుచ్చలేవు. దీన్ని ఆశ్రయించిన జ్ఞానుల, మేధావుల జ్ఞాన పిపాస ఎన్నటికీ తీరదు. మాటిమాటికీ పారాయణం చేసినప్పటికీ ఈ వాక్కు పాతది అనిపించదు. ఇందలి విలక్షణ విషయాలు ఎన్నటికీ తరిగిపోవు, కరిగిపోవు. ఈ వాక్కుయందలి విశిష్టత ఏమిటంటే జిన్నుల వర్గం ఒకసారి దీనిని విన్నప్పుడు 'సన్మార్గం వైపునకు దర్శకత్వం వహించే ఒక అద్భుతమైన వాణిని మేము విన్నాము. కనుక మేము దీనిని విశ్వసిస్తున్నాము' అని ప్రకటించకుండా ఉండలేకపోయింది. ఖుర్‌ఆన్ ప్రకారం మాట్లాడేవాడు సత్య వంతుడు. దీని ప్రకారం ఆచరించేవాడు ఉత్తమ ప్రతిఫలం పొందుతాడు. దీని ప్రకారం తీర్పు ఇచ్చేవాడు న్యాయబద్ధమైన తీర్పరి అవుతాడు. దీని వైపునకు పిలిచినవాడు సన్మార్గం వైపునకు పిలిచిన వాడవుతాడు". (తిర్మిజీ)

దివ్య ఖుర్‌ఆన్‌కి సంబంధించి ఇంతకన్నా గొప్ప పరిచయం మరొకటి ఉండబోదు. మానవతకు మార్గదర్శనంగా ఉన్న గ్రంథం మనిషి కోరిన దానినల్లా గుడ్డిగా ఒప్పుకోదు. ప్రతి వాక్యం గల ఒక తండ్రి తన చిన్నారులను పాడు చేసే ఏ పనినీ చేయనివ్వడు. రోగి బాగోగులను దృష్టిలో పెట్టుకున్న ఒక డాక్టరు రోగిని అతని మానాన వదలి పెట్టడు. అతనికి మింగుడు పడని చేదు మాత్రలను మింగిస్తాడు. అలాగే మానవత పాలిట ఖుర్‌ఆన్ ఒక దివ్య ఔషధం. అది కోర్కెల పగ్గాలను మనిషి చేతికి ఇవ్వకుండా తన వద్దనే ఉంచుకుంటుంది. అవసరమైన చోటల్లా బ్రేకులు వేస్తుంది.

ఖుర్‌ఆన్ మనిషిని మనోవాంఛల దాసుడుగా వదలి పెట్టదు. పశువులు సంతం అతన్ని చూసి సిగ్గుపడే దుస్థితిని రానివ్వదు. అతను పచ్చి వ్యభిచారిగా మారి, దానికి 'ప్రేమ' భూత పట్టిస్తానంటే ఖుర్‌ఆన్ ఒప్పుకోదు. అతను తోమో సెక్సువల్‌గా మారిపోయి 'ఇది నా ఇష్టం. నా స్వేచ్ఛ' అంటే ఖుర్‌ఆన్ ముమ్మాటికీ అంగీకరించదు. అతడు తన ఆరోగ్యాన్ని, మైతికతను సర్వనాశనం చేసే మత్తు పదార్థాలకు బానిసనవుతానంటే ఖుర్‌ఆన్ అడ్డు చెప్పకుండా ఉండదు. అతడు అడ్డగోలుగా వేద ప్రజలను దోచుకుని, షాపుకార్లను గుడ్డిగా సమర్థిస్తానంటే ఖుర్‌ఆన్ సమ్మతించి ఆమోదించదు. ఖుర్‌ఆన్ జీవితపు ప్రతి రంగంలోనూ మానవతకు శ్రేయోదాయకమైన వాటిని మాత్రమే సమ్మతిస్తుంది. అటువంటి దివ్య ఔషధాన్ని మనం మన వరకే ఉంచుకుంటే సరిపోతుందా? దాన్ని మన పరిసరాల్లోని వారికి అందజేయాల్సిన బాధ్యత మనపై లేదా? ఆలోచించండి!



ఈదుల్ ఫిత్ర్



చేయవలసినవి

✔ ఉదయం పెందలాడే తలంటు స్నానం చేసి, ఉన్నంతలోనే మంచి దుస్తులు, కొత్త బట్టలు తొడుక్కుని ఈద్‌గాహ్ వైపు సాగిపోవాలి. ఇది ప్రవక్త (ﷺ) వారి సంప్రదాయం.

✔ వీలైనంతవరకు మంచి సువాసన పూసుకోవాలి. ఇల్లూ వాకిలిని కూడా శుభ్రంగా ఉంచాలి.

✔ ఈద్‌గాహ్‌కు వెళ్ళేముందు అల్పాహారం తీసుకోవాలి. ప్రవక్త (ﷺ) ఈదుల్ ఫిత్ర్ నాడు బేసి సంఖ్యలో ఖర్జూరపండ్లు ఆరగించేవారు.

✔ ఈద్‌గాహ్‌కు ఒక దారి గుండా వెళ్ళి మరో దారి గుండా తిరిగి రావాలి.

✔ ఈద్‌గాహ్‌కు నడచివెళ్ళటం చాలా మంచిది. దారిలో తక్బీర్లు పలుకుతూ ఈద్‌గాహ్‌కు వెళ్ళటం అభిలషణీయం. సంస్కారం ఉట్టిపడే రీతిలో ఈద్‌గాహ్‌కు రావాలి.

✔ పండుగ నమాజుకు స్త్రీలను కూడా పిలుచుకువెళ్ళటం సంప్రదాయం. అయితే బహిష్టు అయివున్న స్త్రీలు నమాజు మాత్రం చేయకూడదు. దుఆలో పాల్గొనవచ్చు. ప్రసంగం వినవచ్చు.

✔ పండుగ నమాజు అనంతరం ధర్మసమ్మతమైన క్రీడా విన్యాసాలు చేయటం వాంఛనీయం.

✔ పండుగ నమాజు అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవటం కూడా వాంఛనీయమే. ప్రవక్త ప్రియ సహచరులు ఈ శుభ సందర్భంగా **'తకబ్బలల్లాహు మిన్నా వ మిన్‌క'** అంటూ శుభాకాంక్షలందజేసుకునేవారు.

✔ పండుగనాడు సమాజంలోని పేద ప్రజలను, అవసరార్థులను, బంధువులను వాకబు చేయాలి. అగత్యపరులను ఆదుకోవాలి.

చేయకూడనివి

✗ అసభ్యకరమైన దుస్తులు ధరించి గర్విష్టుల్లా సంచరించకూడదు.

✗ వస్త్రధారణలోగానీ, ఇతరత్రా విషయాలలోగానీ అవధులు మీరిపోయి సాటి ప్రజలను ఇరకాటంలో పెట్టకూడదు.

✗ ధనాన్ని, మానాన్ని, ప్రాణాన్ని బలిగొనే వ్యర్థ వ్యసనాలకు లోనవరాదు. పందాలు కాయకూడదు. జూదమాడకూడదు. అందరూ ఒకే చోట ప్రోగై ట్రాఫిక్ జాం చేయకూడదు.

✗ పండుగ దినాన స్త్రీలను షరీయతు ఆమోదించని విధంగా – విచ్చలవిడిగా – వదలి పెట్టకూడదు.

✗ అవధులు మీరిన ఆనందంతో పిచ్చి పిచ్చి నినాదాలు ఇవ్వరాదు అశ్లీల పరాచికాలాడకూడదు. అహంకారంతో విర్రవీగుతూ నడవకూడదు.

✗ సభ్యతా సంస్కృతులకు కళంకం తెచ్చే ఆటపాటల్లో, అపసవ్యమైన ప్రహేళికలలో పాల్గొనరాదు.

✗ శుభాకాంక్షలు తెలిపే నెపంతో పర పురుషులు పర స్త్రీలను ఏకాంతంలో పలకరించటంగానీ, కరచాలనం చేయటంగానీ ధర్మ సమ్మతం కాదు.

✗ ఫిత్రా దానం చెల్లించనంతవరకూ ఈద్‌గాహ్‌కు రాకూడదు. ఫిత్రా పండుగ నమాజుకు ముందే చెల్లించాలి. నమాజు తర్వాత చెల్లించేది 'ఫిత్రా' అనబడదు. అది మామూలు సదఖాయే.

✗ పండుగ నమాజుకు ముందుగానీ, తరువాతగానీ ఏ (సున్నతు, నఫిల్) నమాజూ చేయకూడదు.

ఈద్ పర్వదినం

ఆదేశాలు, నియమాలు

నెల రోజుల ఉపవాసాలను విరమించిన శుభ సందర్భంగా అల్లాహ్ ముస్లింల కోసం ఒక ఉత్సవ దినాన్ని నిర్ధారించాడు. అదే ఈదుల్ ఫిత్ర్. రమజాను శుభాలను ఆస్వాదించే సువర్ణావకాశం లభించినందుకు దాసులు తమ ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుకోవటం, శ్రద్ధాభక్తుల నివాళిని ఘటించటం దీని అసలు ఉద్దేశం. ఈదుల్ ఫిత్ర్ హిజ్రీ 2వ సంవత్సరం నుండి షరీయత్ బద్ధమయింది.

ఈద్ అంటే....

అరబీ నిఘంటువు ప్రకారం ఈద్ అంటే మళ్ళీ మళ్ళీ వచ్చేది, పునరావృతం అయ్యేది అని అసలు అర్థం. దీనినే మనం తెలుగులో పండగ, ఉత్సవం, పర్వదినంగా వ్యవహరిస్తాము. ఇస్లాంలో ఏడాదికి రెండే రెండు పండుగలు. ఒకటి: ఈదుల్ ఫిత్ర్ (రమజాను పండుగ). రెండు: ఈదుల్ అజ్హా (ఖుర్బానీ పండుగ). దైవప్రవక్త (ﷺ) మదీనా నగరానికి వచ్చినప్పుడు అక్కడి ప్రజలు రెండు రోజులు ఆటపాటల్లో, ఆనంద ప్రహేళికల్లో గడపటం గమనించారు. "ఇంతకీ ఈ రెండు దినాల విశేషం ఏమిటి?" అని ఆయన (ﷺ) ఆరా తీయగా, 'అజ్ఞానకాలంలో మేము ఈ రెండు దినాలను ఆటపాటలకు, విన్యాసాలకు కేటాయించుకున్నాము' అని అక్కడి వారు వివరించారు. "అల్లాహ్ మీకు ఈ రెండు దినాలకు బదులుగా ఇంతకన్నా శ్రేష్ఠమైన రెండు దినాలను నిర్ధారించాడు. అవే ఈదుల్ ఫిత్ర్, ఈదుల్ అజ్హా" అని మహనీయ ముహమ్మద్ (ﷺ) తెలిపారు.

ఈదుల్ ఫిత్ర్ ఎప్పుడు?

రమజాన్ నెల ముగిసి, షవ్వాల్ నెలవంక దర్శనమిచ్చిన మరునాడు ఉదయం ఈదుల్ ఫిత్ర్ జరుపుకోబడుతుంది. దివ్యఖుర్ఆన్ అవతరించిన రమజాన్ మాసంలో ముస్లింలు ప్రభువు ప్రసన్నత కోసం నెలంతా ఆరాధనలలో గడుపుతారు. తియ్యని నిద్రను త్యజించి రేత్రిళ్ళు జాగారం చేస్తారు. ఈ ఆరాధనలను నిరాఘాటంగా నెరవేర్చ గలిగినందుకు వారి అంతరాళం ఆనందంతో ఉవ్విళ్ళూరుతూ ఉంటుంది. తమ ప్రభువు సన్నిధిలో కృతజ్ఞతలు తెలుపుకోవటానికి ఆరాటపడుతుంది. సహజమైన వారి ఈ కోరికను తీర్చేందుకే దేవుని తరఫున ఈ పండుగ ఆమోదించబడింది.

అయితే శ్రేష్ఠసమాజ సభ్యులైన ముస్లింలు జరుపుకునే పండుగ వారి స్థాయికి తగ్గట్టుగానే ఉండాలి. అదెంతో సంస్కారవంతంగా ఉండాలి. 'అతి' ఎంత మాత్రం తగదు. అసభ్యకరమైన చేష్టలకు, ఆవేశపూరితమైన నినాదాలకు, అవాంఛనీయమైన పోకడలకు పండుగలో ఎలాంటి చోటు లేదంటుంది ఇస్లాం. ఆనందం నిండిన క్షణాల్లో కూడా అధరాలు దేవుని స్తుతిగీతికనే ఆలాపించాలి. అందుకే పండుగ నమాజ్ కోసం ఈద్‌గాహ్‌కు బయలుదేరినపుడు ముస్లింలు ఈ విధంగా తక్బీర్లు పలుకుతూ ఉంటారు – **అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ – లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వ లిల్లాహిల్ హమ్ద్.**

(ముమ్మాటికీ అల్లాహ్‌యే గొప్పవాడు. అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్య దైవం లేనే లేదు. అల్లాహ్‌యే ఘనాఘనుడు. అల్లాహ్‌యే వైభవం కలవాడు. ప్రశంసలన్నీ అల్లాహ్‌కే శోభాయమానం)

పండుగ నమాజు వేళ

వివిధ నమాజుల వేళలు నిర్ధారితమై ఉన్నట్లే పండుగ నమాజు వేళ కూడా నిర్ధారితమై ఉంది. కాబట్టి నిర్ధారిత సమయంలోనే ఈ నమాజు చేయాలి. సూర్యోదయమై, సూర్యుడు రెండు గజాల ఎత్తుకు రాగానే ఈద్ నమాజ్ వేళ మొదలవుతుంది. దీనికి సంబంధించి హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ బసర్ (رضي الله عنه) గారి ప్రామాణిక హదీసు ఇలా ఉంది: "మేము మహా ప్రవక్త (ﷺ)తో కలిసి పండుగ నమాజు చేసేవాళ్ళం. చాష్త్ వేళ అయ్యే సరికి ఈ నమాజు ముగిసేది".

(సహీహ్ అబూ దావూద్)

హజ్రత్ జున్దుబ్ (رضي الله عنه)చే ఉల్లేఖించబడిన హదీసు ఇలా ఉంది: "దైవప్రవక్త (ﷺ) మమ్మల్ని పండుగ నమాజు చేయించటానికి ఉపక్రమించేటప్పటికి రెండు ఈటెల పొడవుకు సమానంగా పొద్దెక్కి ఉండేది."

పండుగ నమాజ్ ఎక్కడ చేయాలి?

ఈద్ నమాజ్ ఇరుకైన జనవాసాలలో కాకుండా విశాలమైన బహిరంగ



ప్రదేశాలలో (మైదానాలలో) చేయటం ఉత్తమం. ప్రవక్త (స) సంప్రదాయం కూడా ఇదే. ఒకవేళ పట్టణాలలో అలాంటి అవకాశం లేనప్పుడు స్థానిక పెద్ద మస్జిదులలో ఈద్ నమాజ్ చేయాలి. తమ పేటల్లోని చిన్న చిన్న మస్జిదులలో, ముసల్లాలో అనుదినం నమాజ్ చేసేవారు కూడా ఈద్ నమాజ్ కోసం ఈద్‌గాహ్‌కో, పెద్ద మస్జిద్‌కో తరలి రావాలి.

మహనీయ ముహమ్మద్ (స) పండుగ రోజు ఉదయం బహిరంగ స్థలానికి ఏతెంచి, తొలుత నమాజుకు సారథ్యం వహించేవారు. ఆ తరువాత సహచరులను ఉద్దేశించి ప్రసంగించే వారు.

మైదానాలలో పర్వదినం జరుపుకోవటం లోని పరమార్థం

"ప్రతి జాతివారు ఏటేటా కొన్ని నిర్ణీత దినాలలో బహిరంగ స్థలాలలో సమావేశమై సంఘీభావాన్ని, సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించటం పరిపాటి. అందుకే ఇస్లాం కూడా తన అనుయాయులకు ఏడాదిలో రెండు దినాలను ఈ లక్ష్య సాధన కోసం ప్రత్యేకించింది - తద్వారా ముస్లిం సముదాయంలోని పిన్నలు-పెద్దలు, స్త్రీలు-పురుషులు అందరూ ఈద్‌గాహ్‌కు తరలివచ్చి హృదయపూర్వకంగా దేవుని ఔన్నత్యాన్ని చాటి చెప్పాలని, తమ ఐకమత్యాన్ని అభివ్యక్తం చేయాలని ఆశించబడుతోంది" అని విశ్వ విఖ్యాత విద్వాంసులు నాసిరుద్దీన్ అల్‌బానీ (ర) అభిప్రాయపడ్డారు.

(సలాతుల్ ఈదైన్ లిల్ అల్‌బానీ)

షరీయతు పరంగా పండుగ నమాజ్...

షరీయతు పరంగా నమాజ్ పండుగ సున్నతె ముఅక్కద. ఎందుకంటే మహా ప్రవక్త (స) ఈ నమాజును ప్రతి ఏటా ఖచ్చితంగా చేశారు. ఏ ఒక్కసారీ విడిచి పెట్టలేదు. ఆయన తదనంతరం ధర్మ ఖలీఫాలు కూడా పండుగ నమాజును విడనాడలేదు. జుమా నమాజు మాదిరి గానే పండుగ నమాజు కూడా 'ఇస్లామీయ చిహ్నాల'లో ఒక చిహ్నంగా పరిగణించబడుతుంది.

పండుగ నమాజు ప్రత్యేకత ఏమిటంటే దీని కోసం అజాన్ పిలుపుగానీ, ఇఖామత్ ప్రకటన గానీ ఉండదు. 'అస్సలాతు జామిఅతున్' అంటూ డిక్లరేషన్ కూడా చేయబడదు.

జుమా నమాజుకి - ఈద్ నమాజుకి మధ్య ఉన్న ఒక వ్యత్యాసం ఏమిటంటే జుమా సందర్భంగా మొదట ప్రసంగం ఉంటుంది, ఆ తర్వాతే సామూహిక నమాజ్. అయితే పండుగ ప్రార్థనల్లో మొదట సామూహిక నమాజ్ చేస్తారు. ఆ తరువాత ప్రసంగం ఉంటుంది.

ఈద్ నమాజ్ విధానం

పండుగ నమాజు రెండే రెండు రకాతులు. అయితే రెండు రకాతుల్లోనూ మామూలుకు భిన్నంగా కొన్ని 'అదనపు తక్బీర్లు' ఉంటాయి. ఇంతకీ ఈ 'అదనపు తక్బీర్లు' ఎన్ని? అనే విషయంలో ధర్మవేత్తల మధ్య ద్వంద్వాభిప్రాయాలు ఉన్నప్పటికీ అదనపు తక్బీర్లు 12 అనే దానికి ఎక్కువ ఆధారాలున్నాయి.

ఏ సూరాలు పఠించాలి?

పండుగ నమాజులో ఖుర్‌ఆన్ బిగ్గరగా పఠించాలి. దైవప్రవక్త (స) మొదటి రకఅతులో ఫాతిహా సూరాతో పాటు అల్ ఆలా సూరాను, రెండవ రకాతులో ఫాతిహా సూరాతో పాటు అల్ ఘాషియా సూరాను పఠించేవారు. అప్పుడప్పుడూ మొదటి రకాతులో ఖాఫ్ సూరా, రెండవ రకాతులో ఇఖ్తరబతిస్సాఅతు సూరాను కూడా పారాయణం చేసేవారు.

(జాదుల్ మఆద్ -1/431)

పండుగ ప్రసంగం

పండుగ నమాజు అనంతరం ఉపన్యాసకుడు (ఖతీబ్) సభికులను ఉద్దేశ్యించి ప్రసంగించటం సంప్రదాయం (సున్నత్). కొంతమంది ఇమాముల దృష్టిలో ప్రసంగం తప్పనిసరి. ఉపన్యాసకుడు స్థానిక ప్రజలు మాట్లాడే భాషలో ప్రసంగించాలి. ఈ శుభ సందర్భంగా సత్కార్యాల గురించి, దానధర్మాల గురించి ప్రేరేపించాలి. సామరస్యం, ఐకమత్యం గురించి నొక్కి వక్కాణించాలి. రమజాన్‌లో ఎంతో శ్రమతో సాధించిన సాత్వికతను కాపాడుకోవలసిందిగా విజ్ఞప్తి చేయాలి. దేశ, సమాజ పరిస్థితులను విశ్లేషిస్తూ ముస్లింల కర్తవ్యాన్ని గుర్తు చేయాలి.

ప్రసంగించవలసిన తీరు

పండుగ నమాజ్ సందర్భంగా మొదట నమాజ్ చేయబడుతుంది, ఆ తర్వాతే ప్రసంగం.

జుమాలో రెండు ఖుత్బాలుంటాయి. కాని పండుగ సందర్భంగా ఒకే ఒక ఖుత్బా ఇవ్వబడుతుంది. పండుగ నమాజు సందర్భంగా రెండు ప్రసంగాలు (ఖుత్బాలు) ఉన్నట్లు, రెండు ఖుత్బాలకు మధ్య ఉపన్యాసకుడు కొన్ని క్షణాలు కూర్చుని విశ్రాంతి తీసుకున్నట్లు ఏ ప్రామాణిక హదీసు ద్వారా కూడా రూఢీ కాలేదు.

నాగేశ్వర రావు తమనం

'కాశ్మీరీల జీవితం గురించి ఏమని చెప్పాలి? రాస్తే ఒక్కో జీవితం ఒక్కో పుస్తకమవుతుంది. తెల్లటి మంచు కొండలు, ఎర్రటి రక్తపు మడుగులు... ఓ పక్క పోలీసులు మరో పక్క మిలిటెంట్లు... మధ్య మధ్యలో ఇండియన్ ఆర్మీ క్యాంపులు. వీటన్నిటి మధ్య స్వేచ్ఛ కోసం మేం చేసే ఆర్తనాదాలు. అందరు కాశ్మీరీల కథ అదే' అని నిట్టూర్చాడు రవూఫ్ మీర్. 2002లో హైదరాబాద్ వచ్చి డిగ్రీలో చేరాడు రవూఫ్. ప్రస్తుతం సెంట్రల్ యూనివర్సిటిలో ఎం.ఫిల్ చేస్తున్న అతను తన జీవితం గురించి, ప్రస్తుతం కాశ్మీర్‌లో జరుగుతున్న నిరసనల గురించి చెప్పిన విషయాలివి.





ఇక్కడికి వచ్చాక కాశ్మీరీలు ఏం

నాకు పది పన్నెండేళ్ల వయసున్నప్పటి సంగతి.... మంచు కురిసే రోజుల్లో పిల్లలందరం ఆ మంచులో పడుతూ లేస్తూ దొర్లుతూ రకరకాల ఆటలు ఆడుకునేవాళ్ళం. వాటిలో ముఖ్యమైన ఆటొకటుంది. అదెలా ఆడతామంటే... సాయంత్రాని కల్లా పిల్లలందరం ఒక చోట చేరి చిన్నచిన్న గ్రూపులుగా విడిపోయేవాళ్ళం. ప్రతి గ్రూపులో నులుగురైదుగురు ఉండేవాళ్లు. ఒక్కో గ్రూపుకి ఒక్కో పేరు పెట్టుకునేవాళ్లం. తర్వాత ప్రతి గ్రూపూ మంచు గడ్డలతో పెద్ద పెద్ద గూళ్లు కట్టేవాళ్లం. గూళ్లు కట్టడం పూర్తయ్యాక ఒక గ్రూపు కట్టుకున్న గూటిపై మరొక గ్రూపు దాడి చేసేది. అదీ మంచు గడ్డలతోటే. ఒకరి గూటిపై ఇంకొకరు మంచుగడ్డలు విసిరేసుకుంటూ ఆ గూళ్లన్నింటిని కూల్చేసేవాళ్లం. ఆ ఆట గురించి అసలు విషయం నేను కాస్త పెద్దయ్యాక కాని అర్థం కాలేదు. అదేంటంటే... మేమప్పుడు గ్రూపులకి పెట్టుకున్న పేర్లన్నీ నా బాల్యంలో కాశ్మీర్‌లో పని చేస్తున్న మిలిటెన్సీ సంస్థలవే. కట్టి కూల్చిన మంచు గూళ్లన్నీ వాటి స్థావరాలే.

కళ్లముందే కాల్పులు..

మా ఊరి పేరు కత్రాన్. అనంతనాగ్ పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మా ఊళ్ళో ఐదో తరగతి వరకు చదువుకున్నాక దగ్గరలో ఉన్న టౌన్‌లో హైస్కూల్లో చేరాను. నిజానికి అది అంత దగ్గరేమీ కాదు. మా ఊరికి ఆ స్కూల్‌కి 17 కిలోమీటర్ల దూరం. ప్రైవేటు బస్‌లో ఏడు కిలోమీటర్లు ప్రయాణించి అక్కణ్ణుంచి స్కూల్ బస్‌లో వెళ్ళేవాడిని. ఆ బస్ అనంతనాగ్ గుండా వెళ్ళేది. అనంతనాగ్ అంటేనే మిలిటెంట్లకి పెట్టింది పేరు. అక్కడ బస్‌ల మీద బుల్లెట్ గుర్తులు, పగిలిపోయిన కిటికీ అద్దాలు సాధారణ దృశ్యాలు. స్కూల్‌కి వెళ్లేటప్పుడు తుపాకులు పేలిన శబ్దం వినబడితే చాలు బస్‌లో ఉన్న పిల్లలందరం ఒక్కసారిగా కళ్లు గట్టిగా మూసుకుని చెవులకి చేతులు అడ్డం పెట్టుకుని సీట్లోనే దాక్కునేవాళ్ళం. స్కూల్ చేరేదాక తల పైకెత్తితే ఒట్టు. ఒక్కోసారి నడిరోడ్డు మీదే మిలిటెంట్లకి పోలీసులకి కాల్పులు జరిగేవి. ఇదంతా చూసి జనం భయపడుతున్నారనే అక్కడ ప్రతి బస్సుకి, వ్యానుకి అద్దాలే కాకుండా వాటిపైన కర్టెన్‌లు కూడా ఉంటాయి. భయపడుతూనే స్కూల్‌కి వెళుతూ పదో తరగతి దాకా చదివాను. నేను ఏడో తరగతి చదివేటప్పుడు ఓ సంఘటన జరిగింది.

ఇంటికి మిలిటెంట్లొచ్చారు...

ఓ రోజు అర్ధరాత్రి ఎవరో తలుపులు తట్టిన శబ్దం వినిపించింది. మిలిటెంట్ల భయంతో నిద్ర పట్టక అంతా మేల్కొనే ఉన్నాం. అందుకే మొదట్లో తలుపు తీయడానికి భయపడ్డాం. తలుపు దగ్గరికి వెళ్ళి వింటే మా ఇంటి పక్కింటాయన గొంతు వినిపించింది. తీరా తలుపు తీస్తే ఆయనకి తోడుగా మరో ఇద్దరు మిలిటెంట్లు. వాళ్ల ఒంటి నిండా రక్తమే. మా బాబాయిల్లో ఒకరు డాక్టరని వారికి తెలిసింది. ట్రీట్‌మెంట్ కోసమని వచ్చారు. గాయాలకి కట్లు కట్టించుకుని వెంటనే వెళ్ళిపోయారు. తలుపులు తీయకపోయినా, ట్రీట్‌మెంట్ చేయకపోయినా మిలిటెంట్లు చంపేస్తారు... ఇలా చేశామని తెలిస్తే పోలీసులు మమ్మల్ని శిక్షిస్తారు. అనుకున్నట్లుగానే జరిగింది. వాళ్లు వెళ్లి పోయిన గంటలోపే పోలీసులొచ్చారు. మా బాబాయిని పట్టు కెళ్ళారు. మూడు రోజులు పోలీస్ స్టేషన్‌లోనే ఉంచిన తర్వాత గాని విడిచి పెట్టలేదు.

ఆ తర్వాత ఆరు నెలల పాటు మా బాబాయి రోజూ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి కనిపించి రావాల్సి వచ్చింది. కాశ్మీర్లో ఇలాంటి ఇబ్బందులు ఇంచుమించు అందరికీ ఏదో ఒక సమయంలో ఎదురయ్యే ఉంటాయి. పదో తరగతి పాస్ అయ్యాక అనంతనాగ్‌లో హయ్యర్ సెకండరీ స్కూల్‌లో చేరాను. అప్పటికి అనంతనాగ్‌లో మిలిటెంట్లకి -పోలీసులకి మధ్య దాడులు,





తెలిసింది కోల్పోతున్నారో

ప్రతిదాడులు ఎక్కువయ్యాయి. దాంతో స్కూల్ అస్సలు జరిగేదే కాదు. ఒక్కోసారి నెలల తరబడి మూత పడే ఉండేది. సంవత్సరం మొత్తంలో ఏ కొన్ని రోజులో మాత్రమే జరిగేది. అందుకే కనీసం పది రోజులు బడికి వచ్చిన వాళ్ళందరినీ పరీక్షలు రాయడానికి అనుమతించారు,. పరీక్షలయితే రాయొచ్చు కాని స్కూళ్లు నడవకపోతే చదువెలా వస్తుంది? అనంతనాగ్‌లో ట్యూషన్ చెప్పేవాళ్లున్నా వెళ్లడానికి బస్సులుండాలి. అందుకే కాశ్మీర్‌లో చదువుకోవడానికి కేవలం డబ్బు, ఆసక్తి ఉంటే చాలదు.

తోటివాళ్ళందరో మిలిటెంట్లయ్యారు

నాతోపాటు హైస్కూల్‌లో చదువుకున్న వాళ్లలో కొంతమంది మిలిటెంట్లలో కలిసిపోయారు. కొందరి ఆచూకీ ఇప్పటికీ తెలియదు. మా బాబాయిల్లో ఒకరు కూడా అంతే... ఇరవయ్యేళ్ల క్రితం ఇల్లు వదలి వెళ్లిపోయాడు. ఇవాల్టికీ తిరిగి రాలేదు. మా నాయనమ్మ ఈ రోజుకీ ఆయన ఫోటో చూసుకుంటూ ఏడుస్తూనే ఉంటుంది. కాశ్మీర్‌లో ఇలా ఆచూకీ లేని వారి సంఖ్య 20 వేల పైచిలుకే.

ఒక్కోసారి మన ప్రమేయం లేకుండానే ఆర్మీకి మిలిటెంట్లకి మధ్య ఇరుక్కుంటాం. నాతోపాటు చదువుకునే ఒకబ్బాయికి అలాంటి పరిస్థితే ఎదురయింది. మిలిటెంట్లంటే సానుభూతి ఉన్న అతను ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు.

ఎలా ఇరుక్కున్నాడోగాని మిలిటెంట్లకి-ఆర్మీకి మధ్య కాల్పులు జరుగుతుంటే ఆ ప్రాంతంలో ఉండిపోయాడు. అటెళ్తే మిలిటెంట్లు చంపేస్తారు. ఇటొస్తే మిలిటెంట్ అనుకుని ఆర్మీ చంపేస్తుంది. ఎటూ వెళ్లలేక మంచులోనే వారం రోజులపాటు ఉండి ఎలాగో బయటపడ్డాడు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టమంతా జరిగి పోయింది. మంచులో వారం రోజుల పాటు ఉండటం వల్ల అతనికి రెండు కాళ్లకి ఇన్ఫెక్షన్ సోకి మోకాళ్ళ దాకా తొలగించాల్సి వచ్చింది. ఇప్పుడాయన మా ఊర్లోనే ఆడియో క్యాసెట్ల షాపు పెట్టుకున్నాడు.

హైదరాబాద్‌కి...

హైస్కూల్ చదువు అయిపోయాక డిగ్రీలో చేరడానికి హైదరాబాద్ వెళతానని మా ఇంట్లో చెప్పాను. అప్పటికే మా పెద్దమ్మ కొడుకు ఇక్కడ చదువుకుంటున్నాడు. అయినా నన్ను పంపించడానికి మా అమ్మానాన్నా మొదట్లో భయపడ్డారు. ఒక్కగానొక్క కొడుకుని కాబట్టి ఏదేమైనా వాళ్ల కళ్ల ముందే ఉండాలని మా నాన్న అనేవాడు. అయితే అక్కడ చదువుకోవడం కుదిరే పని కాదనిపించి హైదరాబాద్‌కి బయల్దేరి వచ్చాను. ఇక్కడికి వచ్చిన తర్వాత కాని తెలియలేదు కాశ్మీరులంతా ఏం కోల్పోతున్నారో. ఇక్కడైతే.... రాత్రి పదకొండు గంటలకి కూడా బయలుదేరి వెళ్లి మా ఫ్రెండ్స్‌ని కలవవచ్చు. అంత స్వేచ్ఛ కాశ్మీర్లో మా ఊహకే అందదు. అక్కడ సాయంత్రం ఆరు గంటలకల్లా నిశ్శబ్దం ఆవరిస్తుంది. వీధులన్నీ ఖాళీ అయి పోతాయి. ముందుగా బయట గేటుకి తాళం వేయాలి. తర్వాత ఇంటిలోకెళ్లి తలుపులు బిగించుకుని కూడా బిక్కుబిక్కుమంటూ గడపాలి. ఇక్కడయితే... నేనసలు రాత్రి పూట తలుపులు తీసి నిద్రపోతాను, ఇంటికి తాళం వెయ్యడం చాలా అరుదు.

హైదరాబాదులో కర్ఫ్యూ అమలు చేసినప్పుడు జనం ఎదుర్కున్న ఇబ్బందులకి పత్రికలు స్పందించిన తీరు చూసి నాకు ఆశ్చర్యమేసింది. అదే కాశ్మీర్లో నెలలపాటు కర్ఫ్యూ అమలైనా జాతీయ పత్రికలేవీ అంతగా స్పందించవు.


క్రాక్‌డౌన్ జరిగితే...

ఆర్మీ రంగంలోకి దిగితే కాశ్మీరీలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతకాల్సిందే. జనమంతా గుర్తింపు కార్డులు తీసుకుని ఊరి మధ్యకి రావాలని రాత్రి పొద్దు పోయినాక ఊర్లో అనౌన్స్‌మెంట్స్ వినబడుతుంది. ఏ ఇంటికీ తాళం వెయ్య కూడదు. తలుపులన్నీ తెరిచి ఉంచి మేమంతా ఊరి మధ్యకి వచ్చేవాళ్ళం. తర్వాత ఆర్మీ జవాన్లు ఇల్లిల్లూ తిరిగి సోదా చేసేవారు. దీన్నే క్రాక్‌డౌన్ అంటారు. ఎవరైనా ఇంట్లోనే ఉండిపోతే వారిని చంపేసినా చంపేయవచ్చు. ఒకవేళ చుట్టాలొచ్చినా, ఎవరికైనా గుర్తింపు కార్డు లేకపోయినా వారి ప్రాణాలు ఆర్మీ చేతుల్లో ఉన్నట్లే. కాళ్లు పట్టుకుని బతిమిలాడటం కాశ్మీరీలకి, వారిని నిర్దాక్షిణ్యంగా కాళ్లతో తన్నడం ఆర్మీలకి అలవాటు. ఆర్మీ రాక్షసుల్లా ప్రవర్తించడానికి కారణం వారికున్న ప్రత్యేక అధికారాలే. అందుకే ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ యాక్ట్ (ఏ.ఎఫ్.ఎస్.పి.ఏ.)ని ఎలాగైనా తొలగించాలని కాశ్మీరీలంతా కోరుకుంటారు. ఇప్పుడు కాశ్మీర్లో మళ్లి అల్లర్లు మొదలయ్యాయి. సుమారు రెండేళ్ల తర్వాత ఆర్మీ క్యాంపులు మళ్లీ వెలిశాయి.

క్రాక్‌డౌన్‌లు రోజు జరుగుతున్నాయి. సామాన్య యువకులెందరో చనిపోతున్నారు. కర్ఫ్యూ కొనసాగుతోంది. బ్యాంకులు కూడా నిరవధికంగా మూతపడడంతో మా నాన్న నాకు డబ్బులు పంపించే వీలు కూడా లేకుండా పోయింది.

గత రెండేళ్ళుగా కొంత ప్రశాంతత నెలకొనడంతో నన్ను కాశ్మీర్‌కి వచ్చేయమని మా నాన్న అనేవాడు. మళ్ళీ అల్లర్లు మొదలవడంతో 'హైదరాబాద్‌లోనే ఉండు.. కనీసం నువ్వైనా స్వేచ్ఛగా బతుకు' అని అంటున్నాడు. కాశ్మీర్లో అంతమంది సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్నా ఈ దేశంలో జనం ఏ మాత్రం స్పందించకపోవడం చూస్తుంటే అసలు మేమీ దేశస్తులమేనా అనిపిస్తుంది. మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేసినప్పుడన్నా ప్రజలు ఎంతోకొంత స్పందిస్తున్నారు. కాని కాశ్మీర్లో అమాయక ప్రజల్ని చంపేస్తున్నా దేశంలో ఏ మూల నుండి ఎలాంటి స్పందనా ఉండదు. ఎందుకని?

('ఆంధ్ర జ్యోతి' దిన పత్రిక :- 25-07-2010 సౌజన్యంతో)



హసన్ సయ్యిద్

సర్వం నీకే అర్పింతు దేవా!

కటిక పేదల్ని సహాయం చేసే
కడు వినమ్రతతో నిన్ను అర్థించే
రెండు హస్తాలు దేవా! మా
ఈ రెండు చేతులు

మసక చీకటిని పారద్రోలే
ఉషః కాంతికి బాట వేసే
నీ ప్రవక్త సుభాషితాల నీడలో
నడిచే రెండు అడుగులు దేవా! మా
ఈ రెండు పాదాలు

నీడలా వెన్నంటి వేధించే
నిరంతర జీవిత సమస్యలను నిర్మలంగా
కరుణామయ రీతిలో పరిష్కరించే
పవిత్ర ఖుర్‌ఆన్ మహా ధుని
సుమధుర ధ్వనులు శ్రావ్యానందంగా
ఆలకించే రెండు వీనులు దేవా! మా
ఈ రెండు చెవులు

ఫజ్ర్ వేళ నిదుర లేచి
ప్రార్థనలో రుకూ సజ్దాలు చేస్తూ
అమృతవాణి పారాయణం చేస్తూ
నిన్నే తలపోసే, నీ సేవలోనే
నిత్యము తన్మయం చెందే
నీ స్మరణలోనే నిరతం నిను దర్శించే
రెండు నేత్రాలు దేవా! మా
ఈ రెండు కళ్ళు

అదయుల తమస్సుని తొలగించే
సదయుల ఉషఃస్సుని వెలిగించే
నిరతము దివ్య జ్యోతి పారాయణ పారీణత
శ్రవణములోనే పరవశించే
ఎన్నడూ విడవక నిన్నే
ఏక చిత్తంతో సంకీర్తించే
ఒకే హృదయం దేవా! మా
ఈ ఒకే ఒక్క మనసు

కామ క్రోధ, మద లోభాలనూ
మా మది నుండి తొలగించు దేవా!
నీ పవిత్ర నామ, అశేష గుణ వర్ణమున
మేను మరచి ఓలలాడేలా దీవించు దేవా!

మా చేతులకు సంకెళ్ళు వేసినా
మా కాళ్ళకు గొలుసులు కట్టినా
చీకటి చెరసాలలో మమ్మల్ని బంధించినా
స్వచ్ఛమైన, సత్యమైన నీ ధర్మాన్ని
చచ్చినా వదులకోని విధంగా ఆశీర్వదించు దేవా!

అబూ అతీఖ్

దేవుని అపురూప సృష్టి

"మరి ఆయన సూచనలలోనే ఒకటేమంటే; ఆయన మీ కోసం స్వయంగా మీలో నుంచే భార్యలను సృజించాడు[1] – మీరు వారి వద్ద ప్రశాంతత పొందటానికి![2] ఆయన మీ మధ్య ప్రేమనూ, దయాభావాన్నీ పొందుపరచాడు.[3] నిశ్చయంగా ఆలోచించేవారి కోసం ఇందులో ఎన్నో సూచనలున్నాయి. భూమ్యాకాశాల సృష్టి, మీ బాషల్లో, రంగుల్లో ఉన్న వైవిధ్యం కూడా ఆయన (శక్తి) సూచనలలోనివే. జ్ఞాన సంపన్నుల కోసం ఇందులో పలు సూచనలున్నాయి". (దివ్యఖుర్‌ఆన్ – 30: 21,22)

1) అంటే మీ కోవలో నుంచే ఆడవారిని సృష్టించాడు. వారు మీకు జత కావటానికి! మీరు వారి ద్వారా సుఖప్రాప్తిని పొందటానికి!! అరబీలో **జౌజున్** అంటే జంట లేక జత అని అర్థం. ఆడది మగవానికి, మగవాడు ఆడదానికి జత **(జౌజ్)** అన్నమాట! దేవుడు లోకంలో తొలి స్త్రీని – హవ్వాను – సృజించేటప్పుడు ఆది మానవుడైన ఆదం ఎడమ వైపు ప్రక్కటెముక నుంచే ఆమెను సృష్టించాడు. ఆ తరువాత ఆ మానవ జంట ద్వారా అవనిలో మానవ జాతిని వ్యాపింప జేశాడు.

2) స్త్రీపురుషులిద్దరూ – ఒకే జాతికి చెందినవారై ఉండి, వారిద్దరూ జంటగా ఏర్పడటం వల్ల సహజమైన ప్రశాంతత, హాయి వారిద్దరికీ లభిస్తోంది. అలాగాకుండా వారిద్దరిలో ఒకరు మనుజ జాతికి చెందినవారు, మరొకరు జిన్నాతుల కోవకు చెందినవారై ఉంటే ఇరువురూ ఎన్నడూ ప్రశాంతంగా ఉండలేరు. పైగా వారి మధ్య అసహ్యభావం పెంపొంది, దాంపత్య జీవితం దుర్భరమవుతుంది. అందుకే అల్లాహ్ మానవ జంటలను మానవుల్లో నుంచే సృజించి వారికి మహోపకారం చేశాడు.

3) **'మవద్దతున్'** అంటే ప్రేమ అని అర్థం. భర్త భార్యను అమితంగా ప్రేమిస్తాడు. అలాగే భార్య భర్తను అమితంగా ప్రేమిస్తుంది. ఈ విషయం జగద్విదితమే. ఆలుమగల మధ్య కనిపించే ఈ అపురూపమైన ప్రేమానురాగాలు ప్రపంచంలో మరే ఇద్దరు వ్యక్తుల మధ్య కూడా కనిపించవు. ఇక **'దయాభావం'** గురించి చెప్పాలంటే భర్త భార్య కోసం అష్ట కష్టాలు పడి ఆమెను సుఖపెట్టేందుకు ప్రయత్నిస్తాడు. ఉన్నంతలోనే ఆమె కొరకు మంచి మంచి సౌలభ్యాలను సమకూరుస్తాడు. అలాగే భార్య తన భర్త కోసం సర్వస్వాన్నీ అర్పిస్తుంది. అతని యోగక్షేమాల కోసం చేయగలిగినంతా చేస్తుంది.

అయితే ఈ దంపతులకు ప్రశాంతత, నిజమైన ప్రేమానురాగాలు లభించేదెప్పుడు? వారు కట్టుకున్న అనురాగ గోపురం పటిష్టంగా ఉండగలిగేదెప్పుడు?? అంటే షరీయతు ఆమోదించిన పద్ధతి ప్రకారం – 'నికాహ్' ద్వారా – భార్యాభర్తలై నప్పుడే. వీరినే ఇస్లాం దంపతులుగా ఖరారు చేసింది. వారి హక్కులు – బాధ్యతలను నిర్దేశించింది. చట్టవిరుద్ధమైన దంపతులను (అక్రమంగా జత కట్టినవారిని) అది భార్యా భర్తలుగా అంగీకరించదు. పైగా అలాంటి వారిని వ్యభిచారులు గా, దుర్మార్గులుగా ప్రకటిస్తుంది. వారి కోసం శిక్షల్ని ప్రతి పాదిస్తుంది.

4) ప్రపంచంలో ప్రజలు మాట్లాడే భాషలు అసంఖ్యాకం. అది కూడా దైవ సూచనలకు ప్రతిబింబమే. అరబీ, ఆంగ్లం, ఫ్రెంచి, ఉర్దూ, హిందీ, పారసీకం వంటి అంతర్జాతీయ స్థాయి భాషలే గాక ప్రతి దేశంలో వేర్వేరు భాషలున్నాయి. ఒక్క భారత దేశంలోనే ఒక డజనుకు పైగా గుర్తింపు పొందిన భాషలు ఉన్నాయి. గుర్తింపు పొందని భాషలు ఇంకా అనేకం. మరి ఒకే భాషలో అనేక మాండలికాలు, యాసలు ఉంటాయి. ప్రతి వ్యక్తీ తాను మాట్లాడే యాసను బట్టి ఏ ప్రాంతంవాడో ఇట్టే గుర్తించ బడతాడు. ఆ విధంగా మనిషి మాట్లాడే భాష లేక అతని యాస అతన్ని పరిచయం చేసేసుకుంటుంది. అలాగే కోట్లాది మంది మానవులు ఒకే తల్లిదండ్రులైన ఆదం – హవ్వాల నుంచి వచ్చినవారైనప్పటికీ వారి రంగులు వేరు, రూపురేఖలు వేరు. ప్రతి ఒక్కరూ ఇతరులకన్నా భిన్నంగా, విలక్షణంగా కనిపిస్తారు. వారిలో కొందరు తెల్లవారు, కొందరు నల్లవారు, కొందరు చామనఛాయ, కొందరు గోధుమ రంగు గలవారున్నారు. అలాగే కొందరు పొట్టివారు, కొందరు పొడుగరులు. ప్రతి దేశం, ప్రతి ఖండం వారు తమ శరీరాకృతిని బట్టి ఇట్టే తెలుసుకోబడతారు. అంతేకాదు, ఒకే తల్లి బిడ్డలైన ఇద్దరు అన్నదమ్ములు కూడా భిన్నంగా కనిపిస్తారు. ఇదంతా ఆ సృష్టికర్త అపురూప సృష్టికి ప్రబల తార్కాణం.

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com



పగవారి పన్నాగాలు

మహా ప్రవక్త ముహమ్మద్ (ﷺ) మక్కా ప్రజల ఆచార సంప్రదాయాల్ని, నమ్మకాల్ని, పద్ధతుల్ని గుడ్డిగా సమర్థించి ఉంటే, వాళ్ళ ఆదరాభిమానాల్ని చూరగొని ఉండేవారేమో. కాని, ఆయన అలా చేయలేదు. వారిలో చోటు చేసుకున్న రుగ్మతలను, వెర్రి పోకడలను అంతిమ ప్రవక్త (ﷺ) నిరసించారు. దురాచారాలు, దుష్చర్యలన్నింటినీ కూల్చివేసి, వాటి శిథిలాలపైనే ఉత్తమ నైతిక నిర్మాణ పునాదులు కూడా వేశారు. మహా ప్రవక్త (ﷺ) వారి దృష్టి నిశితం – సునిశితం. ఆయన దృష్టి విశ్వాంతరాళంలోకి దూసుకుపోయింది. సృష్టి పరమ రహస్యాలను, సృష్టికర్త శక్తియుక్తులను లోతుగా – విశాలంగా, నిదానంగా – నెమ్మదిగా – నమ్రతతో పరిశీలించారాయన. సృష్టి గురించి ఆయనకు తెలిసిన విషయాలు అగణ్యం. సృష్టికర్త ఆయనకు తెలిపిన రహస్యాలు అనన్యం. కనుకనే ఆయన వాక్కు సత్యం. సత్య సౌందర్యం ఆయన మాటల్లో, భావాల్లో, ఆచరణల్లో ప్రస్ఫుటంగా వ్యక్తమయ్యేది. సూక్ష్మం-సున్నితం-సత్యం అయిన దివ్య వాణిని ఆయన తన మధురమైన స్వరంతో కోటి రాగాలు పలికించారు. ఆయన నోట వెలువడే ప్రతి మాట శక్తివంతం-సుకుమారం -మార్దవం. అది రమ్యమైనది- మనోహరమైనది- సంతోష కరమైనది-సహజమైనది- అద్భుతమైనది – అద్వితీయమైనది – అమోఘమైనదీను. అది ఒక్కోసారి భయాన్ని కలిగిస్తుంది. దడ పుట్టిస్తుంది. పాపం, నేరం, నరకం విషయంలో అది అలాగే ఉంటుంది.

దైవ నామస్మరణ లేమితో నిర్జీవమైన మానవ హృదయాలకు తిరిగి నవ జీవనాన్ని ఇచ్చేందుకు, రుజుమార్గాన్ని చూపించేందుకు వచ్చారు మహా ప్రవక్త (ﷺ). కామం, క్రోధం, మదం, మత్సర్యాలతో బైర్లు కమ్మిన మానవ నేత్రాలకు కాంతిని ఇచ్చేందుకు ప్రభవించారు అంతిమ ప్రవక్త (ﷺ). దాసుల్ని, దాసుల, సృష్టితాల దాస్యం నుండి వెలికితీసి దైవ విధేయులుగా మలచి మహోన్నత స్థానానికి ఎత్తి అద్భుతానంద జగత్తులో విహరింప జేయడానికి విచ్చేశారు ప్రియ ప్రవక్త (ﷺ). కామాంధుల కబంద హస్తాల్లో చిక్కుబడి విలవిల్లాడుతున్న మాననీమణుల దుఃఖమయ జీవితంలో సంతోషాల పూలు పూయించడానికి, ఆనందాన్ని పంచడానికి అరుదెంచారు ఆదర్శ ప్రవక్త (ﷺ).

అయితే ఆయన పట్ల లోకం వ్యవహరించిన విధానమే విడ్డూరం!! లోకోద్ధరణ కోసం, లోక శాంతి కోసం, సర్వ మానవ కళ్యాణం కోసం ప్రభవించిన ఆ క్రాంతికారుడినే "ఇతనో పిచ్చోడు, మతి స్థిమితం లేనివాడు' అన్నారు. వాస్తవంగా వారి హృదయాలపైనే గాఢాంధకారాలు అలుముకుని ఉన్నాయి. వారు నిజంగా వివేచనాపరులై ఉంటే, అవినీతి చట్టాలతో బూజు పట్టిన మత సిద్ధాంతాలతో, కల్లిబొల్లి కథనాలతో కంపు కొట్టే వ్యవస్థను సమర్థించేవారే కాదు.

ఇవేమీ పట్టని పగవారు అటు ప్రవక్త (ﷺ) వారిని హతమార్చేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. 'ముహమ్మద్ (ﷺ) తీసుకొచ్చిన ఉద్యమాన్ని ఎలాగైనా సరే అరికట్టాలి. చివరికి అతన్ని హత మార్చాల్సి వచ్చినా పరవాలేదు' అన్నారు అందరూ. 'బ్రహ్మాండంగా ఉంది మీ ప్రణాళిక. అసలు పన్నాగం అంటే ఇలా ఉండాలి. మీ పుర్రెల్లో పుట్టిన ఈ ఆలోచన అమోఘం! అద్భుతం!!' అని షైతాను కూడా సర్టిఫికెట్ ఇచ్చాడు.

నలు దిక్కులా చీకటి రాజ్యమేలుతోంది. నింగిలోని తారలు నేలపై నీతినడవడికల్ని శాంతిని, ధర్మాన్ని నాశనం చేసేందుకు నిలబడివున్న నరరూప రాక్షసుల గురించి తర్జనభర్జనలు పడుతున్నాయి. గాఢాంధ కారంలో మక్కా నగరం మౌన సముద్రం దాల్చి ఉంది. కారుణ్యమూర్తి (ﷺ) వారి ఇంటి చుట్టూ శత్రువులు ఈటెలు, బాకులతో మాటు వేసి కూర్చుని ఉన్నారు ...ఏం జరుగుతుంది..? అన్న ఉత్కంఠ, ఆందోళనతో చంద్రుడు సయితం అవని వైపు కళ్ళు చించుకుని చూస్తున్నాడు.

దైవప్రవక్త (ﷺ) వారి గృహంలో ఏదో అలకిడి వినబడుతుంది!..."అలీ! జాగ్రత్త!! తెల్లవారగానే ఇంట్లో భద్రపరచిన వస్తువులన్నీ ఎవరివి వాళ్ళకు అప్పజెప్పి, ఆనక బయలుదేరి మదీనా వచ్చెయ్యి". ఏమిటా వస్తువులు? ప్రజలతోపాటు పగవారు సయితం ప్రవక్త (ﷺ) వద్ద దాచుకున్న ధన కనక వస్తువులు అవి. ఎంత ఔదార్యం! అదే రాత్రి – "వ జఅల్నా మిన్ బైని ఐదీహిమ్ సద్దం వ్వమిన్ ఖల్ఫిహిమ్ సద్దన్ ఫ అగ్ష్లైనాహుమ్ ఫహుమ్ లా యుబ్సిరూన్" (యాసీన్: 9) – (మేము వారి ముందు ఒక అడ్డును, వారి వెనుక ఒక అడ్డును పెట్టాము. ఆ విధంగా మేము వారిని కప్పివేశాము. తత్కారణంగా వారు చూడలేరు) అన్న ఆయతు చదువుతూ... గుప్పెడు మన్ను శత్రువులపై విసిరి అక్కడి నుండి సురక్షితంగా బైటపడ్డారు ప్రవక్త (ﷺ). అటుపిమ్మట అబూ బక్ర్ (ﷺ) ఇంటికెళ్ళి ప్రయాణ సన్నాహాలు పూర్తి చేసుకొని 'సౌర్' గుహ వైపునకు సాగిపోయారు. ప్రవక్త (ﷺ) తమ కళ్ళు గప్పి వెళ్ళిపోయారని తెలుసుకున్న శత్రువులు గాలింపు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పట్టుకొచ్చి ఇచ్చే వ్యక్తికి 100 ఎర్ర ఒంటెలు బహుమానం అని ప్రకటించారు.

షేక్ అబ్దుల్ అజీజ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ బాజ్

వీర్య స్ఖలనం వల్ల ఉపవాసం భగ్నమవుతుందా?



– ఉమర్ .ఎం (రియాజ్)

ప్రశ్న: రమజాను నెలలో – ఉపవాస స్థితిలో – ఉపవాసికి వీర్యస్ఖలనం (ఇహ్తిలామ్) జరిగినట్లయితే, అతని ఉపవాసం (రోజా) భంగమవుతుందా? లేదా? అతను వెంటనే స్నానం చేయాలా?

జవాబు: వీర్య స్ఖలనం వల్ల ఉపవాసం భంగమవదు. ఎందుకంటే ఇది ఉపవాసి నియంత్రణలో లేని విషయం. అయితే వీర్య స్ఖలనం జరిగినప్పుడు మాత్రం స్నానం (గుసుల్) చేయటం తప్పనిసరి.

ఒకవేళ ఫజ్ర్ నమాజ్ తర్వాత వీర్యస్ఖలనం జరిగితే జుహ్ర్ నమాజ్ వేళ వరకు స్నానాన్ని వాయిదా వేసినాసరే ఉపవాసానికి ఎలాంటి దోషం ఏర్పడదు... అలాగే రాత్రి పూట భార్యతో సమాగమం జరిపి, ఉషోదయం అయినప్పుడు స్నానం (గుసుల్) చేసినా కూడా దోషం లేదు. ఎందుకంటే ఈ విషయం మహా ప్రవక్త ﷺ ద్వారా నిరూపితమై ఉంది. ఆయన ﷺ లైంగిక అశుద్ధావస్థలో తెల్లవార్చి (ఫజ్ర్ నమాజు ముందు వరకు), స్నానం చేసి ఉపవాసం పాటించిన సందర్భాలున్నాయి.

రుతుస్రావానికి, పురిటి రక్త స్రావానికి లోనైవున్న స్త్రీలకు కూడా ఇదే నియమం వర్తిస్తుంది. రాత్రి బహిష్టు ఆగిపోయిందని (పరిశుద్ధత లభించిందని) నిర్ధారణ అయినట్లయితే, రోజా సంకల్పం చేసుకుని తెల్లవారాక స్నానం చేసినా ఫరవాలేదు – అట్టి పరిస్థితిలో వారి 'రోజా'కు ఎలాంటి విఘాతం కలగదు. కాని వీరైనా, సంభోగ అశుద్ధావస్థలో ఉన్నవారైనా ఉద్దేశ్యపూర్వకంగా స్నానానికి, ఫజ్ర్ నమాజుకు ఆలస్యం చేయటం మాత్రం సమ్మతం కాదు. పైగా ఇలాంటివారంతా స్నానం చేసి పరిశుద్ధత పొందటానికి వేగిరపడాలి. ఫజ్ర్ నమాజును వేళకు చేయాలి – ఇది తప్పనిసరి.

స్వప్న స్ఖలనం జరిగినా, రక్తస్రావం జరిగినా వాంతి అయినా ఉపవాసం భంగమవుతుందా?

– ఎం.వి.ఎ

ప్రశ్న: (అ) నేను ఉపవాసం ఉన్న స్థితిలో మస్జిద్‌లో నిద్రపోయాను. తీరా నాకు మెలకువ వచ్చినమీదట తెలిసింది – నాకు స్వప్న స్ఖలనం జరిగిందని. నేను స్నానం చేయకుండానే నమాజు చేశాను. దీనివల్ల నా నమాజుకు, రోజాకు ఏమైనా హాని కలుగుతుందా?

(ఆ) ఒకసారి ఉపవాస స్థితిలో నా తలకు రాయి తగిలి రక్తం స్రవించింది. తత్కారణంగా నా ఉపవాసం భగ్నమయిందా?

(ఇ) అదేవిధంగా దానంతట అదే అయ్యే వాంతి వల్ల రోజాకు ఏమైనా నష్టం జరుగుతుందా? దయచేసి నా సందేహాలు తీర్చగలరని ఆశిస్తాను.

జవాబు: **(అ)** స్వప్న స్ఖలనం వల్ల ఉపవాసం భగ్నమవదు. ఎందుకంటే అది మీ అదుపులో లేని విషయం. కాని అంగం నుండి వీర్యం స్ఖలించబడినట్లు నిర్ధారణ అవుతే మాత్రం స్నానం చేసి పరిశుద్ధతను పొందవలసిందే. ఇది తప్పనిసరి. ఎందుకంటే ఒక సందేహానికి దైవప్రవక్త ﷺ ఇచ్చిన సమాధానం ద్వారా ఇది తప్పనిసరి (వాజిబ్) అని స్పష్టమవుతోంది. ఇకపోతే, మీరు స్నానం చేయకుండానే నమాజు చేశానంటున్నారు. ఇది తప్పు. కాబట్టి మీరు ఆ నమాజును తిరిగి చేయటంతోపాటు క్షమాపణకై అల్లాహ్‌ను వేడుకోవాలి.

(ఆ) తలకు రాయి తగిలి, రక్తం స్రవించటం వల్ల మీ ఉపవాసానికి ఎలాంటి విఘ్నం కలగదు.

(ఇ) ఇక దానంతట అదే అయిపోయిన వాంతి గురించి. అందులో కూడా మీ ప్రోద్బలం ఏమీ లేదు గనక మీ 'రోజా'కు ప్రమాదం వాటిల్లదు. ఎందుకంటే మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు:

"ఎవరికయితే అప్రయత్నంగా వాంతి జరిగిందో వారు తమ ఉపవాసాన్ని 'ఖజా' చేసుకోవలసిన అవసరం లేదు. మరెవరయితే బలవంతంగా వాంతి చేశారో, వారు ఉపవాసాన్ని ఖజా చేసుకోవాలి. (తిరిగి రోజా పాటించాలి)".

ఈ హదీసును 'అహ్మద్'తో పాటు సునన్ ప్రభృతులంతా ప్రామాణిక సనదులతో పొందుపరిచారు.

ఫిత్రా దానం ఎంత?

– మర్యం

ప్రశ్న: సదఖతుల్ ఫిత్ర్ (ఫిత్రా దానం) ఎంత ఇవ్వాలి?

జవాబు: ఇది ఆయా ప్రాంతం లేక పట్టణ ప్రజల జీవన ప్రమాణాలను, వారు తినే ఆహారాన్ని బట్టి ఉంటుంది. సాధారణంగా ప్రజలు తాము తినే ఆహార ధాన్యాలను 'ఫిత్రా దానం'గా ఇవ్వాలి. ఒక ఫిత్రా పరిమాణం 'ఒక సా' (అంటే దాదాపు 3 కిలోలు) – అది గోధుమలైనా కావచ్చు, బియ్యమైనా కావచ్చు, ఖర్జూర పండ్లయినా కావచ్చు – మరే ధాన్యమైనా కావచ్చు. ప్రతి ముస్లిం తరఫున ఈ సదఖతుల్ ఫిత్ర్ చెల్లించవలసిందే – వారు పురుషులైనా, స్త్రీలయినా, చిన్నవారైనా, పెద్దవారైనా, యజమానులైనా, సేవకులైనా – అందరి తరఫున పండుగ నమాజు చేయకముందే ఈ దానం ఇవ్వాలని మహా ప్రవక్త ﷺ హదీసుల ద్వారా రూఢీ అవుతున్నది. పండుగకు ఒకట్రెండు రోజులు ముందే చెల్లించినా ఫరవాలేదు.

ఇస్లాం శిక్షణ

అజీజుర్రహ్మాన్

శుభ్రతా సంస్కారాల సరోవరం నమాజు



నమాజు చేసే ప్రతి వ్యక్తీ శుచీ, శుభ్రతలను పాటించటం అవశ్యం. ఇస్లాం తొలి ఆజ్ఞలలో తహారత్ ఒకటి. దైవప్రవక్త ముహమ్మద్ (ﷺ)పై రెండవసారి అవతరించిన దివ్యవాణి శుచీశుభ్రతల (తహారత్) కు సంబంధించినదే. ఉదాహరణకు:– "నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో. అశుద్ధతను వదలిపెట్టు".

(అల్ ముద్దస్సిర్ – 4,5)

అందుకే ఇస్లాం పరిశుభ్రత, పరిశుద్ధతలకు సంబంధించిన సూత్రాలను నిర్ధారించింది. దైవప్రవక్త (ﷺ) తన బోధనల ద్వారా దాని సరిహద్దులను ఖరారు చేశారు. నమాజు సజావుగా నెరవేరాలంటే మనిషి శరీరం, అతను తొడిగే దుస్తులతోపాటు అతను నమాజు చేసే స్థలం కూడా పరిశుభ్రంగా ఉండాలి – ఎలాంటి మలినం ఉండకూడదు. ఒకప్పుడు అరబ్బులు కూడా ఇతర అనాగరిక జాతుల మాదిరిగా శుచీశుభ్రతలను బొత్తిగా పాటించేవారు కాదు. ఉదాహరణకు ఒక పల్లెటూరి బైతు సాక్షాత్తూ మస్జిదె నబవీలోనే – అందరి సమక్షంలో – మూత్రం పోసేశాడు. సహచరులు (ﷺ) అతన్ని కొట్టేందుకు ఎగబడ్డారు. దైవప్రవక్త (ﷺ) వారందరినీ వారించారు. "నాయనా! ఇది ప్రార్థన చేసే స్థలం. ఇలాంటి చోట మల మూత్ర విసర్జన చేయకూడద"ని ఎంతో నిదానంగా నచ్చచెప్పారు. ఆ వ్యక్తి మూత్రం పోసిన చోట నీళ్లు కుమ్మరించమని ప్రియసహచరుల్ని పురమాయించారు.

ఒకసారి ఆయన (ﷺ) ఒక సమాధి దగ్గరి నుంచి సాగిపోతూ, "ఈ సమాధిలోని వ్యక్తి యాతనకు గురవుతున్నాడు. ఇంతకీ ఈ వ్యక్తి (వల్ల జరిగిన అశ్రద్ధ ఏమిటంటే) మూత్రపు తుంపరలు తన శరీరంపై పడుతున్నా లక్ష్యపెట్టేవాడు కాదు" అన్నారు. ఈ విధంగా ముస్లింలు శుచీశుభ్రతల విషయంలో కడు జాగ్రత్తగా ఉండాలని నొక్కి వక్కాణించబడింది. కాలకృత్యాలు తీర్చుకునే విషయంలోనూ, వుజూ గుసుల్ విషయంలోనూ గొప్ప నాగరీక జాతులు సయితం పాటించని మర్యాదలు ముస్లింలకు బోధించబడ్డాయి.

తమ శరీరాన్ని, దుస్తులను, నివాస గృహాలను అన్ని రకాల మలినాల నుండి కాపాడుకుంటూ షరీయతు బద్ధంగా తహారత్ పాటించే ప్రవక్త శిష్యులను అల్లాహ్ ఈ విధంగా కొనియాడాడు:

"ఈ మస్జిద్‌లో ఉండే వారిలో కొందరు బాగా పరిశుద్ధతను పాటించటాన్ని ఇష్టపడతారు. అల్లాహ్‌కు పరిశుద్ధతను పాటించే వారంటే ఎంతో ఇష్టం". (దివ్యఖుర్‌ఆన్ – 9:108)

దేవుని ప్రేమాభిమానానికి పరిశుభ్రత (తహారత్) ఒక ప్రధాన కారణమైనప్పుడు ఈ భాగ్యానికి ఎవరయినా ఎలా దూరంగా ఉండగలుగుతారు??

నమాజు వల్ల కలిగే ఇంకొక ప్రయోజనమేమిటంటే, అది మనిషిని అనుదినం నీటుగా ఉండేలా చేస్తుంది. అతడు నిత్యం తన ఒంటిని, దుస్తులను శుభ్రంగా ఉంచుకుంటాడు. నమాజు చేసే వ్యక్తి రోజుకు ఐదు సార్లు తన ముఖాన్ని, కాళ్ళుచేతులను నియమబద్ధంగా కడుక్కుంటాడు. ముక్కులో సయితం నీళ్ళు జొన్పి నాసిక పుటాలను శుభ్రపరుస్తాడు. దీనివల్ల వైద్య పరంగా కలిగే లాభాలు ఎన్నో. ముక్కు పుటాల మార్గం గుండా శరీరం లోపలికి వెళ్ళే సూక్ష్మక్రిములు ఈ 'వుజూ' ద్వారా దూర మవుతాయి.

ముక్కులో సయితం నీరు పోసి శుభ్రపరచే శిక్షణ బహుశా ఇస్లాం ఒక్కటే ఇచ్చింది. ప్రపంచంలో మరే మతం కూడా ఈ శిక్షణ ఇవ్వదు. దీన్నిబట్టి ఇస్లాం ఆదేశాలు వైద్యశాస్త్రం దృష్ట్యా కూడా ఎంతో మేలైనవే. ఒకప్పుడు నీరు అతి తక్కువ మోతాదులో లభ్యమయ్యే అరబ్బు ప్రదేశంలో రోజుకు ఐదు సార్లు 'వుజూ' చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పటం ఇస్లాంకే చెల్లింది.

అరబ్బులు – ముఖ్యంగా పల్లెటూళ్లలోని వారు – పల్లు తోము కోవడం పట్ల మరీ సోమరితనం ప్రదర్శించేవారు. తత్కారణంగా నోట్లో నుంచి దుర్వాసన రావటమేగాకుండా, రకరకాల దంత వ్యాధులు కూడా సోకేవి. మహా ప్రవక్త (ﷺ) ప్రతి నమాజు సందర్భంగా 'మిస్వాక్' (దంత ధావనం) చేయాలని తాకీదు చేశారు. "ఒకవేళ నా అనుచర సమాజం ఇబ్బందికి గురవ దనుకుంటే మిస్వాక్ చేయటాన్ని అవశ్యంగా ఖరారు చేసి ఉండేవాణ్ణి" అని ఆయన (ﷺ) చెప్పటం గమనార్హం.

అలాగే వీలునుబట్టి స్నానం చేస్తూ ఉండాలి. స్నానం చేశాక పొడి దుస్తులు ధరించటం, సుగంధ ద్రవ్యాలు పూసుకోవటం మంచిది. ముఖ్యంగా శుక్రవారం (జుమా) నమాజుకైతే స్నానం చేసి మరీ రావాలి.

మన గురువులు

- ముహమ్మద్ హుసైన్ బొర్రా

జీవితాన్ని ప్రభావితం చేసేవారు అరుదుగా ఉంటారు
జీవితాన్ని సవ్య దిశలో మలచేవారు వారే అయి ఉంటారు
మదిలో ఆత్మ విశ్వాసమనే విత్తనాన్ని నాటేవారు
విజయమనే గమ్యాన్ని చేరేందుకై జ్ఞానాన్ని సమకూర్చేవారు
చిన్నచిన్న అపజయాల పాలైనప్పుడు గుండెల్లో
పొదువుకునేవారు
బాధాతప్త హృదయుడి కనుకొలను నుండి రాలే
దుఃఖాశ్రువులను తుడిచేవారు
జీవితాంతం బాధించే దురలవాట్ల నుండి, ధూర్తుల నుండి
రక్షించేవారు
కలిమి లేములను ఒక్కలా చూసే సమవర్తులు
జ్ఞానబోధకు తారతమ్యాలను, సామాజిక అంతరాలను
లెక్కించని వారు
విద్యార్థుల భవిష్యత్తే ధ్యేయమై తమ సుఖసంతోషాలను
వదులుకునేవారు
వృత్తినే సర్వస్వంగా భావించి, తాము కొవ్వొత్తుల్లా
కరుగుతూ ఇతరులకు వెలుగునిచ్చేవారు
పిల్లల సాఫల్యమే తమ భాగ్యమని ఉత్తుంగ తరంగంలా
ఎగిసిపడేవారు
మన జీవితపు దశా దిశల నిర్దేశకులు
ఆ యశస్సులు మరెవరో కారు మన గురువులు
అందుకే, అందుకే, అందుకే...
నిన్నా, నేడూ, రేపూ, మరెప్పుడూ మన గురువులు
సదాస్మరామి



ముహమ్మద్ ఖాన్ (గన్నవరం)

అప స్వరం

ఆలోచనను
అక్షరంగా మలిచే క్రమములో
నా కలం, చిత్రకారుని కుంచెలా
ఎల్లప్పుడూ, గాయపడుతూనే ఉంటుంది.

ఒక చక్కటి ఊహను
కుంచెకు అద్ది, ఆ రూపాన్ని రంగుల్లో నాన్చి
కాగితంపై చిత్రించే దశలో
చిత్రకారుడు
బహు చిత్రంగా ఓడిపోవడం గెలవడం
మనం, కనులార్పకుండా చూస్తుండిపోతాము

ఏదో ఒక అపస్వరం
వీణను చుట్టముట్టి బాధిస్తున్నట్లు
గేయం, గాయమై రోదిస్తుందా అన్నట్లు
ఆ చిత్ర ప్రయత్నాన్ని
ఊహించని మలుపు ఏదో ఛిన్నాభిన్నం చేస్తుంది

చిత్రకారుడు
అంతుపట్టని ఆవేదనతో
తన వంక, అసంపూర్తిగా ఎదుట నిలిచిన చిత్రం వంక
శూన్యంలో తప్పిపోతాడు.

అక్షరం అనంతమై విస్తరించేందుకు
ఆకాశమయి పుష్పించేందుకు
చీకట్లలో మిణుగురు వెలుతురులా
ఒక మైరుపు మస్తిష్కాన్ని వెలిగించి తప్పుకుంటుంది
కవిత కలం నీడలో చిగురిస్తుంది, చిత్రంగా!

మూలం:
షేఖ్ అబూ బకర్ నజ్జార్

కాల చరిత్రకు సంకేతం 'గుహావారు'

"వారు గుహలో 309 సంవత్సరాలు (నిదురపోతూ) ఉన్నారు". (ఖుర్‌ఆన్ - 18: 25)

ఇఫ్‌సస్ నగరంలో పండుగ రోజు అది. ఆ రోజున ప్రజలు తమ విగ్రహాలకు పూజలు చేసి ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తారు. కాని ఈ కార్యక్రమంలో పాల్గొనకుండా ఒక యువకుడు దూరం గా ఉండిపోయాడు. ఎందుకంటే, అతని మనసులో ఈ కార్యక్రమం పట్ల అనేక అనుమానాలు ఉన్నాయి. అతను ఒక చెట్టు నీడన కూర్చుని నగరంలో జరుగు తున్న కార్యక్రమం గురించి ఆలోచించ సాగాడు. కొంతసేపటి తర్వాత అతని మిత్రుడొకడు వచ్చి కలిశాడు. కొంత సేపటికి మరొకరు. అలా మొత్తం ఏడుగురు మిత్రులు అక్కడ కలిశారు. వారందరి ఆలోచనా విధానం ఒక్కటే. విగ్రహారాధన పట్ల, విగ్రహారాధకుల పట్ల వారి మనస్సుల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. అల్లాహ్ వారికి సత్యాన్ని గ్రహించే వివేకం ప్రసాదించాడు. వారు తాము నమ్మిన ధార్మిక విశ్వాసాన్ని తమ హృదయాల్లోనే దాచుకోవాలని నిర్ణ యించుకున్నారు. ఎందుకంటే రాజు కూడా విగ్రహారాధకుడే కాబట్టి తమ విశ్వాసం గురించి చెబితే రాజు వేధింపు లకు గురిచేస్తాడని భయపడ్డారు.

రహస్య సమాలోచన

వారంతా మళ్ళీ ఒక రాత్రి సమావేశ మయ్యారు. అందులో ఒకరు గుసగుసగా మిగిలిన వారితో మాట్లాడుతూ - "రాజుగారికి మన గురించి తెలిసి పోయిందట. మనం మతం మార్చు కున్నామని తెలిసి రాజు కోపంతో మండి పడుతున్నాడట. కనుక మనం విగ్రహా రాధనలో పాల్గొనకపోతే శిక్షిస్తానని బెదిరించినట్లు కూడా తెలిసింది. రేపు మనల్ని తన దర్బారుకు పిలిపిస్తాడు. దర్బారులో మనపై విచారణ జరిపిస్తాడు. ఇప్పుడు మనమేం చేయాలో ఆలోచిం చండి" అన్నాడు. మరొక యువకుడు జవాబిస్తూ, "నాకు కూడా ఈ విషయం తెలిసింది. కాని ఇదంతా ఒక పుకారు మాత్రమే అనుకుంటున్నాను. ఏదిఏమైనా మనం మన విశ్వాసం విషయంలో దృఢంగా ఉండాలి. మళ్ళి విగ్రహా రాధనకు మరలిపోవడం మన వల్ల కాని పని. ఈ సృష్టి మొత్తానికి మహా సృష్టికర్త ఒకడున్నాడని చెప్పడానికి చాలా నిదర్శ నాలున్నాయి" అన్నాడు.

రాజుగారి దర్బారులో

మరుసటి రోజు ఆ ఏడుగురిని రాజుగారు దర్బారుకు పిలిపించాడు. వారిని ప్రశ్నించడానికే రాజు పిలిపిస్తు న్నాడని, రాజుకు కొత్త మతం అంటే గిట్టదని వారికి బాగా తెలుసు. అయినా వారు భయపడలేదు. తమ ప్రభువు భూమ్యాకాశాలకు ప్రభువని, ఆ సృష్టికర్త ను తప్ప మరెవ్వరినీ దేవునిగా అంగీ కరించలేమని నిర్భయంగా చెప్పారు. అల్లాహ్‌ను తిరస్కరిస్తే మహా పాపం చేసినట్లు అవుతుందని కూడా వివరించారు.

ఈ మాటలు విని రాజుగారికి చాలా కోపం వచ్చింది. వారికి మరణ శిక్ష విధిస్తాడన్నాడు. కాని వారు కులీన కుటుంబాలకు చెందినవారయినందువల్ల వారికి ఒక రోజు గడువు ఇచ్చాడు. ఈలోగా తమ కొత్త మతాన్ని వదులుకో నట్లయితే వారికి చావు తప్పదని హెచ్చరించాడు. వారు అల్లాహ్ పట్ల విశ్వాసంతో మరింత బలాన్ని పొంది ఇలా జవాబిచ్చారు: "రాజా! ఈ మతాన్ని మేము ఎవరి ప్రోద్బలం వల్లనూ స్వీకరిం చలేదు. మా హృదయాలలో ఉన్న సహజ సిద్ధమైన భావనల ప్రేరణ వల్ల మాకు లభించిన వరం ఇది. అల్లాహ్ మా హృదయాలను ప్రకాశవంతం చేశాడు. ఆయన ఒక్కడే దేవుడు. ఆయనే మాకు ప్రభువు. ఆయనే భూమ్యాకాశాలకు ప్రభువు. మేము ఆయన్ను తప్ప మరెవ్వరినీ దేవునిగా ఆరాధించలేము. రాజా...మా పట్ల నీవు ఎలా వ్యవహరిం చాలనుకున్నా నీ ఇష్టం... ఇప్పుడే నీ ఇష్టమొచ్చినట్లు చేయడం మంచిది" అన్నారు. రాజు జవాబిస్తూ, "నేను నా నిర్ణయాన్ని ప్రకటించేశాను. కాబట్టి ఒక రోజు ఆలోచించుకునే గడువు ఉంది. రేపు నేను నా తుది తీర్పు వినిపిస్తాను" అన్నాడు.

తప్పించుకోవడం

రాజదర్బారు నుంచి వచ్చిన తర్వాత వాళ్ళు తమ పథకాన్ని ఆచరణలో పెట్టడానికి పూనుకున్నారు. వారిలో ఒకడు మిగిలిన వారితో, "మనం మన విశ్వాసం పట్ల ఎంత దృఢంగా ఉన్నామో రాజుకు తెలుసు కాబట్టి తప్పక మన మీద చర్య తీసుకుంటాడు. ఒకవేళ రాజు చర్య తీసుకోకపోతే ప్రజలు రాజును బలహీనుడిగా భావించి పరిహసిస్తారు. కాబట్టి మనం ఇక్కడ ఉండటం క్షేమం కాదు, పట్టణాన్ని వదలి కొండ గుహల్లో ఎక్కడైనా తల దాచుకుందాం. అక్కడ మనం స్వేచ్ఛగా మన విశ్వాసం ప్రకారం జీవించవచ్చు. ఎవరి జోక్యం ఉండదు" అన్నాడు.

తమకు లభించిన ఆహార పదార్థాలు తీసుకుని ఆ ఏడుగురు యువకులు కొండలకు వెళ్ళిపోయారు. అక్కడ వారందరికీ సరిపోయే వైశాల్యం ఉన్న ఒక గుహ కనబడింది. ఆ గుహలో వాళ్ళు దాక్కున్నారు. వారిని అనుసరిస్తూ ఒక కుక్క కూడా అక్కడి వరకు వచ్చింది. ఆ కుక్క గుహ ముఖ ద్వారం వద్ద కూర్చుంది. వాళ్ళు తమ వద్ద ఉన్న ఆహార పదార్థాలు తిని, సమీపంలోని వాగు నీరు త్రాగి విశ్రాంతి తీసుకున్నారు. కొద్దిసేపటికే వాళ్ళంతా గాఢ నిద్రలో మునిగిపోయారు.

ఆ ఏడుగురు పట్టణం వదలి వెళ్ళిన విషయాన్ని అందరూ చెప్పుకోసాగారు. వాళ్ళు ఎక్కడికి వెళ్ళారో ఎవరికీ తెలియ లేదు. వారి తల్లిదండ్రులు వారిని వెదక డానికి చాలా మందిని పంపించారు. రాజు కూడా దేశం యావత్తు వారి కోసం వెదికించాడు. కాని వారి జాడ దొరక లేదు. వారు ఈ విధంగా మాయం అయి పోయిన సంఘటన తర్వాత చాలా కాలం వరకు జనం కథలుగా చెప్పుకున్నారు. అనేక తరాల వరకు ఈ కథ వ్యాపించింది.

దీర్ఘ నిద్ర

రోజులు, నెలలు గడిచాయి. తర్వాత సంవత్సరాలు గడిచిపోయాయి. వాళ్ళు అలాగే గాఢ నిద్రలో ఉండిపోయారు. సూర్యకిరణాలు ఆ గుహలోనికి రాలేదు. కటిక చీకటిలో ఉండటం వల్ల వారి గురించి బాటసారులకు కూడా తెలుసుకునే అవకాశం చిక్కలేదు. వారి చుట్టూ ఉన్న దుర్మార్గపు ప్రపంచం నుంచి అల్లాహ్ వారికి ఆశ్రయం కల్పించాడు. ఆ విధంగా వారు 309 సంవత్సరాల కాలం నిద్రలో గడిపారు. (దివ్య ఖుర్‌ఆన్ ప్రకారం మూడు వందలకు పైబడి తొమ్మిది సంవత్సరాలు. దీన్ని బట్టి 300 సంవత్సరాలు సూర్యమాన సంవత్సరాలని, పైన ఉన్న తొమ్మిది సంవత్సరాలు చంద్రమాన సంవత్సరాల లెక్కలోనివని గ్రహించవచ్చు.)

ఆ తర్వాత అల్లాహ్ వారిని మళ్ళీ నిద్ర నుంచి లేపాడు. నిద్ర నుంచి మేల్కొన్న తర్వాత ఆ ఏడుగురు తాము చాలా సేపు నిద్రపోయామని అనుకున్నారు. అందులో ఒకడు జవాబిస్తూ బహుశా ఒక రోజంతా నిద్రపోయి ఉంటామన్నాడు. మరొకడు జవాబిస్తూ, సూర్యాస్తమయం ఇంకా కాలేదు కాబట్టి రోజులో కొంత భాగం మాత్రమే నిద్రపోయి ఉంటామన్నాడు. ఇంకొకడు మాట్లాడుతూ, "ఈ ఊహలు కట్టిపెట్టండి. నిజం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ముందు నాకు ఆకలి చాలా వేస్తోంది. మనలో ఎవరినైనా పట్టణానికి పంపించి ఆహారం తెప్పిద్దాం. మన జేబుల్లో ఎవరి వద్ద ఎంత సొమ్ము ఉందో పోగుచేయండి. పట్టణానికి వెళ్ళేవారెవ

> "రాజా! ఈ మతాన్ని మేము ఎవరి ప్రోద్బలం వల్లనూ స్వీకరించలేదు. మా హృదయాలలో ఉన్న సహజ సిద్ధమైన భావనల ప్రేరణ వల్ల మాకు లభించిన వరం ఇది. అల్లాహ్ మా హృదయాలను ప్రకాశవంతం చేశాడు. ఆయన ఒక్కడే దేవుడు. ఆయనే మాకు ప్రభువు. ఆయనే భూమ్యాకాశాలకు ప్రభువు. మేము ఆయన్ను తప్ప మరెవ్వరినీ దేవునిగా ఆరాధించలేము."

రైనా చాలా జాగ్రత్తగా ఉండాలి. మన ఆచూకి ఎవరికీ తెలియకూడదు" అన్నాడు. వాళ్ళంతా తమ వద్ద ఉన్న సొమ్మును ఒకరికి ఇచ్చారు. అతడిని పట్టణానికి పంపించారు.

ఆ యువకుడు పట్టణం దగ్గరకు చేరుకున్నప్పుడు, అక్కడి పరిసరాలు చూసి చాలా ఆశ్చర్యపోయాడు. అంతా కొత్తగా ఉంది. అతను ఏదీ గుర్తు పట్టలేక పోయాడు. భవనాలు, ప్రజల వస్త్రధారణ, వ్యవహార శైలి అన్నీ మారిపోయాయి. అతను ఒక పలహార శాల చూసి అందులోకి ప్రవేశించాడు. ఆ దుకాణం దారుడు యువకుడి ముఖంలోని తేజస్సుకు ఆశ్చర్యపోయాడు. యువకుడు రొట్టెలు కావాలని అడిగాడు. కాని ఆ యువకుడు ఇచ్చిన నాణేలు చూసి దుకాణందారుడు ఆశ్చర్యపోయాడు. ఆ విచిత్రమైన నాణేలు ఎక్కడి నుంచి తీసుకు వచ్చావని ప్రశ్నించాడు. అలాంటి నాణేలు ఇక్కడ వాడకంలో లేవని అన్నాడు. వారిద్దరి మధ్య వాగ్వివాదం ప్రారంభం అయింది. త్వరలోనే జనం గుమిగూడారు. ఆ యువకుడు ఆ ప్రాచీన నాణెలను ఎక్కడి నుంచి సంపాదించాడో తెలుసుకోవాలని ప్రతి ఒక్కరూ భావించారు. ఆ యువకుడు ఆ డబ్బు తన సొంతమని వాదించాడు. రాజ భటులు అక్కడికి వచ్చారు. ఆ యువకుడిని న్యాయస్థానానికి తీసుకు పోవడం జరిగింది. అక్కడ ఆ యువకుణ్ణి ప్రశ్నించడం జరిగింది. అతను తన గురించి చెప్పాడు. గుహలో ఉన్న తన ఆరుగురు మిత్రుల గురించి కూడా చెప్పాడు. అప్పుడు ప్రజలకు ఆ యువకుడెవరో తెలిసింది. మూడు వందల తొమ్మిది సంవత్సరాల క్రితం పట్టణం నుంచి మాయమైన ఏడుగురు యువకుల్లో ఒకడిగా గుర్తించారు. దుర్మార్గపు రాజు మరణించి అనేక వందల సంవత్సరాలయ్యిందని తెలిసి ఆ యువకుడు కూడా ఆశ్చర్యపోయాడు.

కొత్త రాజ్యం

ఈ సంఘటన గురించిన వార్త రాజుగారికి తెలిసింది. ఆయన ఒక సందేశహరుడిని పంపి ఆ యువకుడిని పిలుచుకురమ్మన్నాడు. యువకుడు చెప్పిన విచిత్రమైన కథ విన్న తర్వాత రాజు ఆ యువకునితో కలిసి కొండ గుహ వద్దకు వెళ్ళాడు. యువకుడు తన మిత్రులను రమ్మని పిలిచాడు. ఇప్పుడు భయపడవలసిన పనిలేదని చెప్పాడు. వారు గుహ బయటకు వచ్చారు. ఆ యువకుల ముఖాలపై తేజస్సు చూసి రాజు ఘ్రాన్పడిపోయాడు. వారిని చాలా అభిమానంగా ఆలింగనం చేసుకున్నాడు. మిగిలిన యువకులు తమ మిత్రుడి ద్వారా జరిగిన కథ తెలుసుకున్నారు.

తన భవనానికి రాజు వారిని రమ్మన్నాడు. కాని వారు ఆ ఆహ్వానాన్ని మర్యాదగా కాదంటూ, తమ బంధువులు, మిత్రులు అందరూ మరణించినందువల్ల ఇక జీవితంలో తమకు కావలసింది ఏమీ మిగల్లేదని అన్నారు. వారు చేతులెత్తి అల్లాహ్‌ను ప్రార్థిస్తూ తమను కారుణ్యంతో కాపాడమని కోరుకున్నారు. ఆ వెంటనే వారి ఆత్మలు వారి శరీరాలను వదలి వెళ్ళిపోయాయి. అయినా ఆ యువకుల ముఖాలు తేజస్సుతో ప్రకాశిస్తూనే ఉన్నాయి. వారి అంత్యక్రియలకు వేలాది ప్రజలు హాజరయ్యారు. కొండ గుహను వారి సమాధిని రాజు అందంగా కట్టించాడు.

(చదవండి దివ్యఖుర్‌ఆన్-18: 9-20)

(సమాధులను అందంగా కట్టించడం అన్నది ముహమ్మద్ ప్రవక్త (స) ప్రవచనం ప్రకారం నిషిద్ధం. ప్రవక్త ముహమ్మద్ (స), ఆయన సహచరులు, షహీదులు (అమరవీరులు) ఎవరి సమాధులు కూడా ఈ విధంగా కట్టించబడలేదు).





ఇస్రా - మేరాజ్ సందర్భంగా...

ఐపిసి ఆసిమా బ్రాంచ్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో 9-7-2010వ తేదీ శుక్రవారం నాడు **"ఇస్రా - మేరాజ్"** శుభ సందర్భాన్ని పురస్కరించుకుని న్యూ ముస్లిం సోదరుల ఓ సమావేశం నిర్వహించబడింది. ఖైతాన్ బ్రాంచ్ న్యూ ముస్లిం సోదరులు సయితం పాల్గొన్న ఈ కార్యక్రమంలో 'మేరాజ్ సందేశం' అన్న అంశంపై **నెలవంక** ఎడిటర్ శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్, ఐపిసి దాయి మౌలానా సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ ప్రసంగించారు. ఐపిసి దాయీ షేఖ్ ముహమ్మద్ బిలాల్ గారు క్విజ్ ప్రోగ్రాం నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు.

రమజాన్ మాసమా! స్వాగతం!!





శుభాల సరోవరమైన 'రమజాను మాసానికి స్వాగతం' అన్న అంశంపై ఐపిసి ఆసిమా బ్రాంచ్, తెలుగు సెక్షన్ తరఫున న్యూ ముస్లిం సోదరులతో ఓ చక్కని కార్యక్రమం 6-08-2010వ తేదీన నడపబడింది. ఐపిసి దాయీ మౌలానా అబ్దుస్సలాం ఉమ్రీ గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం హాఫిజ్ ఖలీల్ అహ్మద్ మృదు మధుర ఖుర్ఆన్ పారాయణంతో మొదలయింది. బ్రదర్ ఉస్మాన్ తెలుగులో తర్జుమా చదివి వినిపించారు. బ్రదర్ షేఖ్ రియాజ్ రమజాన్ మాసానికి స్వాగతం పలుకుతూ గీతాలాపన చేశారు. నెలవంక సంపాదకులు శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ రమజాన్ శుభాలను వివరించారు.

- అబుల్ తాహిర్

నేటి బాలలే రేపటి పౌరులు - 5



మర్నాడు శుక్రవారం. జుమా నమాజు అనంతరం ఇమామ్ గారి ఇంటికి వెళ్ళాడు అలీ. 'అస్సలాము అలైకుమ్ అలీ భాయి' అంటూ కాస్తంత దూరంలో వస్తున్న అలీని చూసి ఇమామ్ గారు ఆహ్వానించారు. వరండాలో కాసేపు కూర్చోని ఆ మాటా ఈ మాటా చెప్పుకున్నారు. మధ్యలో ఇమామ్ గారు మాట అందుకుంటూ "అవునండి, ఇప్పటి వరకూ కథే సాగుతున్నదా?" అని ప్రశ్నించారు.

"అవునండి. ఉపాధ్యాయులనూ, విద్యార్థులనూ మరింత దగ్గర చేర్చడానికి కథ ఒక మంచి సాధనం. ఆ విషయంలో కథ అద్భుతంగా, ఇంద్రజాలంగా పని చేస్తుంది. ఈ నిజాన్ని నేను అనుభవ పూర్వకంగా కూడా తెలుసుకున్నాను. మొదటి రోజు నా మాటే వినని వాళ్ళు, హా..హా హీ..హీ అని నన్ను నానా రకాలుగా వెక్కిరించినవాళ్ళు కథ చెప్పడం ప్రారంభించిన దగ్గర నుంచి బుద్ధి మంతులైపోయారు. నన్ను ప్రేమతో చూస్తున్నారు. చెప్పిన మాట వింటున్నారు. ఇంటికి వెళ్ళిపొమ్మని చెప్పినా కూడా కదలడం లేదు" అని బాల విహార్ సమాచారాన్నంతా ఇమామ్ గారికి అందజేశాడు అలీ.

"సరే కాని వారికి ఖుర్‌ఆన్ ఎప్పుడు నేర్పిస్తారు?"

"హజ్రత్! ఇప్పుడు చేస్తున్న పనే అది. వాళ్ళకు కథ ద్వారానే కట్టుబాట్లు నేర్పుతున్నాను. ఇస్లామీయ సాహిత్య పరిచయం చేయిస్తున్నాను. వారికి మానర్స్ నేర్పుతున్నాడు. రేపటి నుంచి మరి కొన్ని ఇతర విషయాలు కూడా నేర్పడం మొదలెడతాను" అన్నాడు అలీ.

ఆ తర్వాత ఇమామ్ గారి నుంచి సెలవు తీసుకొని ఇంటికి బయలుదేరాడు అలీ.

అది అలీకి మూడవ రోజు. కథ కోసం పిల్లలు గోళాకారంలో వరుసగా వారి వారి స్థలాల్లో కదలకుండా కూర్చున్నారు. ఈ రోజు అతని కార్యక్రమం హాజరు తీసుకోవడం, సంభాషణ, కథ. హాజరు అయ్యాక, సంభాషణ ప్రారంభించాడు.

"రండి, మీ గోళ్ళు చూపించండి! అవి ఎలా ఉన్నాయో చూద్దాం. అందరూ నిలబడి మీ చేతులు చూపించండి" అని పురమాయించాడు... కొందరివి మినహాయించి అందరి గోళ్ళు పెరిగి ఉన్నాయి. గోళ్ళలో మట్టి కూడా పేరుకుపోయి ఉంది...

"మీ టోపీలు చేతిలోకి తీసుకుని చూడండి! ఎంత మురికిగా ఉన్నాయో! ఎంత పాతబడ్డాయో చూసుకోండి! శుచీ శుభ్రత అంటే పియ ప్రవక్త (ﷺ)కి మహా ఇష్టం తెలుసా?"

అందరూ తమ టోపీలు తీసి చూసుకున్నారు. ఒకరిద్దరు తప్ప మిగిలిన వాళ్ళ టోపీలన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. "మీ చొక్కా గుండీలు సరిగా ఉన్నాయేమో చూసుకోండి" చివరకు చెప్పాడు – కథకు ఆలస్యమైపోతున్నది కదూ! అని వెంటనే కథను ప్రారంభించాడు.

అది రాత్రి సమయం. చంద్రుడు తన వెన్నెలను నేల నాలుగు చెరగులా వెద జల్లుతున్నాడు. ఊరి బైట ఓ పెద్ద రాతి విగ్రహం. చంద్రుడి వెన్నెల్లో ఆ విగ్రహ పాదాల వద్ద ముగ్గురు వ్యక్తులు చేతులు కట్టుకొని నిలబడి ఉన్నారు. ముగ్గురూ ఆ విగ్రహాల వైపు ఎంతో ఆశతో చూస్తున్నారు. అది వారి ప్రార్థనలకు ఏ సమాధానమూ ఇవ్వలేదు. వారికి లాభం గానీ నష్టంగాని కలిగించే శక్తీ దానిలో లేదు. అది తన చోటి నుండి కదలలేని మెదలలేని చలనంలేని శిల్పం. అయినా ఆ ముగ్గురూ అ విగ్రహంతో మాట్లాడుతున్నారు.

'నాకు అన్నం కావాలి' అన్నాడొకడు.
'నాకు నీళ్ళు కావాలి' విన్నవించుకున్నాడు మరొకడు.
'నా కుమారుడికి ఆరోగ్యం ప్రసాదించు' మనవి చేసుకున్నాడు ఇంకొకడు.

ఇది ఆనాటి ప్రజల స్థితి. తన్ను అద్భుత ఆకారంలో మలచిన ఆ నిజ స్వామిని మరచి వారు తమ తెగ పుణ్య పురుషులలో దైవత్వం ఉందని భ్రమించి, వారి ఆకారాల్లో ఉన్న విగ్రహాలను ఆశ్రయిస్తున్నారు. ఇది మనిషికి పరమ శత్రువైన షైతాన్ ఎత్తుగడ అని వారికి తెలియదు పాపం. ఒకవేళ తెలిసినా, వారికి వారి తాతముత్తాతల ఆచారాల పట్ల ఉన్న శ్రద్ధాభక్తులు వారిని సత్యం నుండి ఆపుతున్నాయి. కనుక వారిని చక్కదిద్దాల్సిన సమయం రానే వచ్చింది.

కథ మధ్యలో ఒక పిల్లవాడు అడిగాడు: "హజ్రత్! కథల పుస్తకాలు ఎప్పుడు తెస్తారండీ!"
ఒకటి రెండు రోజుల్లో తీసుకు వస్తానని చెప్పి, అలీ మళ్ళీ కథ ప్రారంభించాడు.

(సశేషం)

హసన్ సయ్యిద్

'అమ్ర్ బిన్ లుహయ్యి' మొదట్లో తను గొప్ప భక్తిపరాయణత గల వ్యక్తి, మంచి కార్యాల్లో, దానధర్మాల్లో బాగా పేరున్నవాడు. ప్రజలకు సయితం తనంటే ఎంతో అభిమానం. అతని మాటను శాసనంగా భావించేవారు. చివరికి అతన్నే తమ నాయకుడిగా కూడా ఎన్నుకున్నారు. 'కాబా' గృహానికి సంబంధించిన ఏ కార్యం అయినా అతని చేతుల మీదుగానే జరిగేది. క్రమేణా ప్రజలు అతన్ని ఓ మేధావిగా, గొప్ప పుణ్యపురుషుడిగా భావించసాగారు.

షిర్క్ పుట్టు పూర్వోత్తరాలు - 3

కొంత కాలం తరువాత తను 'సిరియా' దేశానికి వెళ్ళాడు. అక్కడ సిరియా దేశస్థులు విగ్రహారాధన చేస్తూ, జాతరలు నిర్వహిస్తూ, ఎంతో విచిత్ర చేష్టలు చేస్తూ ఉండటం చూసి ప్రభావితుడయ్యాడు. వాటిని సత్యం అని భ్రమించాడు. ఎందుకంటే, అతని దృష్టిలో ఆ దేశం దైవ గ్రంథాలు అవతరించిన నేల! దైవ ప్రవక్తలు నడిచిన పుణ్యభూమి!! ఈ కారణంగానే సిరియన్లను ఇతరులు సయితం గౌరవించేవారు.

అలా తను మక్కాకు తిరిగి వస్తూ తనతోపాటు 'హుబుల్' అనే విగ్రహాన్ని వెంటబెట్టుకు వచ్చాడు. ఆ విగ్రహాన్ని తెచ్చి 'కాబా' లోపల పెట్టించాడు. ప్రజల్లో ముందు నుండీ అతని పట్ల గౌరవభావం ఎలాగూ ఉంది గనక వారు నోరు మెదపకుండా అతన్నే అనుసరించారు. 'హిజాజ్' వాసులు ప్రతి విషయంలో మక్కా వారిని సంప్రదించేవారు గనక వారు సయితం విగ్రహారాధనను మెలమెల్లగా ఒంట బట్టించుకున్నారు. అలాగే మక్కా ప్రజల్ని అరబ్బులు గొప్పగా అభిమానించేవారు. అందుచేత వారు కూడా ఈ మహమ్మారికి గురయ్యారు. అయితే అరబ్బు ప్రజల్లో, వారు పల్లె ప్రాంతాలకు చెందినవారైనా – కొద్దోగొప్పో ఇబ్రాహీమ్ (عليه السلام) గారి సంప్రదాయాలు మిగిలే ఉండేవి. కాని అమ్ర్ బిన్ లుహయ్యి విసిరిన మాయాజాలం వల్ల వారి నమ్మకాల్లో మార్పు వచ్చిన విషయం నిజమే. అయినప్పటికీ వారు అల్లాహ్‌నే నిజ దైవంగా భావించేవారు. కనుకనే ఇలా అనేవారు: "లబ్బైక లాషరీక లక్ – ఇల్లా షరీకన్ హువ లక్ – తమ్లికుహు వమా మలక్" (నీకు మరెవరూ సాటి లేరు. నీవు కేటాయించుకున్న వారు తప్ప. వారికి ఎలాంటి అధికారం లేదు. వారికి అధికారమిచ్చినవాడివి నీవే). అంటే 'లా షరీక లక్' తర్వాత 'ఇల్లా షరీకన్....' అనే పదాలను జోడించుకునే వారు. (ఇది కూడా విగ్రహారాధన క్రిందికే వస్తుంది).

అరబ్బుల అతి ప్రాచీన విగ్రహాల్లో 'మనాత్' కూడా ఒకటి. ఇది ఔస్ మరియు ఖ్రజ్‌జ్ తెగవారి ఆరాధ్య విగ్రహం. 'లాత్' తాయిఫ్ ప్రజల ఆరాధ్య శిల్పం. 'లాత్' అనబడే ఈ వ్యక్తి గొప్ప దానశీలుడు. హాజీలకు అతిథి మర్యాదలు చేసేవాడని అంటారు. అతని మరణానంతరం ప్రజలు అతని రూపాన్ని ఓ శిల్పంగా చెక్కుకుని పూజించనారంభించారు. ఇంకా మక్కా మరియు తాయిఫ్‌ల మధ్యనున్న 'నఖ్లా' అనే లోయ ప్రాంతానికి చెందిన ప్రజలు 'అల్ ఉజ్జా'ను తమ ఆరాధనా విగ్రహంగా భావించేవారు. ఈ మూడు విగ్రహాలు అలనాటి అరబ్బుల్లో ప్రసిద్ధిగాంచినవి. పెద్ద దేవతలుగా పరిగణించబడేవి. ఆ తర్వాత క్రమేణా బహుదైవారాధన విస్తరించింది. ప్రతి ఊరిలో, ప్రతి వాడలో విగ్రహాలు పుట్టగొడుగుల్లా పుట్టు కొచ్చాయి. ప్రతి ప్రాంతానికి, గ్రామానికి, కుటుంబానికి, తెగకి ఓ ఆరాధనా విగ్రహం ఉండేది. అలా పూర్తి అరబ్బు ప్రాంతం కొంగ్రొత్త విగ్రహాలతో కిక్కిరిసి పోయింది. దాదాపు ఇదే స్థితి అటు పూర్తి ప్రపంచంలోనూ నెలకొని ఉంది. అలా పూర్తి అరబ్బు ప్రాంతం కొంగ్రొత్త విగ్రహాలతో కిక్కిరిసిపోయింది. ఇలాంటి తరుణంలో తళుక్కున మెరిసిందొక ఆశాకిరణం. అల్లాహ్, ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (స)ను అంతిమ ప్రవక్తగా నియమించి, మక్కా పట్టణంలో ప్రభవింపజేశాడు.ఆయన ప్రజలను కటిక చీకట్ల నుండి రక్షించి 'ఇస్లాం' అనే కాంతి మార్గంలో నడిపించారు.

ఈ విషయాన్నే ఆ పరమ ప్రభువు ఇలా పేర్కొంటున్నాడు: **"అల్లాహ్ విశ్వసించినవారిలో వారి జాతికే చెందిన ఒక ప్రవక్తను ప్రభవింపజేసి వాస్తవంగా వారికి గొప్ప మేలు చేశాడు. ఆ ప్రవక్త దేవుని సూక్తులు విన్పిస్తూ వారి జీవితాల్ని తీర్చిదిద్దుతున్నాడు. వారికి గ్రంథ జ్ఞానాన్ని, వివేకాన్ని బోధిస్తున్నాడు. ఇది వరకు వారు పూర్తిగా అపమార్గంలో పడి ఉండేవారు".** (దివ్యఖుర్ఆన్ - 3: 164)

బహుదైవారాధన నుండి వారించే వాడిగా, ఏకదైవారాధన వైపు ఆహ్వానించేవాడిగా, నరక శిక్ష గురించి భయపెట్టే వాడిగా, స్వర్గ వనాల గురించి శుభవార్త అందజేసేవాడిగా చేసి అల్లాహ్ మహా ప్రవక్త ముహమ్మద్ (స)ను పంపాడు.

"ప్రవక్తా! మేము నిన్ను (ప్రవక్తలు, వారి సముదాయాలపై, ప్రజలందరిపై) సాక్షిగా, శుభవార్త అందజేసేవానిగా, భయపెట్టేవానిగా, అల్లాహ్ ఆజ్ఞతో ఆయన వైపు సందేశం అందజేసేవానిగా, (విజ్ఞాన కాంతుల్ని వెదజల్లే) వెలుగుతున్న దీపంగా చేసి పంపాము". (దివ్యఖుర్ఆన్- 33: 45,46)

ఆయన్ను ప్రవక్తగా చేసిన పిదప ఇలా ఆదేశించాడు: "ఓ ముద్దస్సిర్! లే. లేచి (ప్రజలను) హెచ్చరించు. నీ ప్రభువు ఔన్నత్యాన్ని చాటి చెప్పు. నీ దుస్తులు పరిశుభ్రంగా ఉంచుకో. అపవిత్రత, అపరిశుద్ధతలకు దూరంగా ఉండు. ఏ మేలయినా ప్రాపంచిక ప్రయోజనాలు ఆశించి చేయకు. (కష్టాలు వచ్చినప్పుడు) నీ ప్రభువు (ప్రసన్నత) కోసం సహనం వహించు". (దివ్యఖుర్ఆన్- 74: 1-7)

పై వచనంలో **'ఖుమ్ ఫ అన్జిర్'** అంటే- బహుదైవారాధన గురించి హెచ్చరించు. ఏకదైవారాధన వైపు ఆహ్వానించు అని అర్థం. **'వ రబ్బిక ఫ కబ్బిర్'** అంటే- తౌహీద్ (ఏకదైవారాధన) విశిష్ఠతను తెలియపర్చు. **'వ సియాబక ఫ తహ్హిర్'** అంటే- నీ కార్యాలకు బహుదైవ భావన గాలి కూడా సోకకుండా కాపాడుకో. **'వర్రుజ్జ ఫహ్‌జుర్'** లో **'అర్రుజ్జ'** అంటే- విగ్రహాలు. అనగా వాటిని త్యజించు. వాటిని విడనాడు. స్వస్తి పలుకు అని అర్థం.

అలా అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ ﷺ ప్రజల్ని ధార్మికంగా చైతన్యవంతుల్ని చేయడంతోపాటు, విగ్రహారాధన నుండి వారించారు. అయితే కొంత మంది మాత్రమే ఆయన్ను విశ్వసించారు. ఎక్కువ మంది నిరాకరించారు. వారు ఇలా ఇన్నారు: "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని చెబితే గర్వంతో వారు 'ఏమిటి! ఓ పిచ్చి కవి చెప్పే మాటలు విని మా దైవాలను వదులుకోవాల్నా?' అంటారు". (దివ్యఖుర్ఆన్- 37: 35,36)

వారికి ప్రతి జవాబుగా ఆ సర్వేశ్వరుడు ఇలా సమాధానమిస్తున్నాడు: "కాదు. వాస్తవంగా అతను సత్యం తీసుకొచ్చాడు. గత ప్రవక్తల (బోధనల)ను ధృవ పరుస్తున్నాడు. (అలాంటి ప్రవక్తను నిరాకరిస్తే) మీరు తప్పకుండా అతి బాధాకరమైన శిక్ష చవి చూడవలసి వస్తుంది. మీకు లభించే ప్రతిఫలం మీరు చేసుకునే కర్మలను బట్టే ఉంటుంది". (దివ్యఖుర్ఆన్- 37: 37,38)

మహా ప్రవక్త ﷺ ఎన్ని ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారో మనందరికీ తెలిసిన విషయమే. చివరికి అల్లా ఆయన్ను ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న 'హృదయాల విజేత'గా చేశాడు. ఆయన ద్వారా తన సనాతన ధర్మమైన 'ఇస్లాం'ను సంపూర్ణం గావించాడు. ఇలా అన్నాడు: "నేనీ రోజు మీ కోసం మీ ధర్మాన్ని (సమగ్ర జీవన వ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీ కోసం నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీ శ్రేయస్సు కోసం ఇస్లాంను (శాంతి మార్గాన్ని) మీ జీవనధర్మంగా ఆమోదించాను". (దివ్యఖుర్ఆన్-5:3)

"ఇకపై ఎవరైతే (ఇలాంటి) దైవ విధేయతా మార్గం (ఇస్లాం) కాదని ఇతర జీవిత విధానాలను (ఇస్లామేతర పద్ధతులను, శాంతిని విచ్ఛిన్న పర్చే చేష్టలను) అవలంబించగోరుతారో వాటిని ఎన్నటికీ ఆమోదించడం జరగదు. అలాంటివారు పరలోకంలో ఘోరంగా నష్టపోతారు". (దివ్యఖుర్ఆన్-3: 85)

మహా ప్రవక్త ﷺ పూర్వపు ప్రవక్తలు, గ్రంథాలు, జాతులు, వారి స్థితిగతుల గురించి తెలియ పర్చడంతోపాటు ప్రళయం వరకు సంభవించబోయే కొన్ని ముఖ్య సూచనలను తెలియజేశారు.

హజ్రత్ అమ్ర్ బిన్ అఖ్‌తబ్ అన్సారీ ﷺ గారి కథనం: "దైవ ప్రవక్త ﷺ మమ్మల్ని నమాజు చేయించారు. ఆ తరువాత వేదికపైకెక్కి జుహర్ నమాజు వరకు ప్రసంగించారు. వేదిక దిగి జుహ్ర్ నమాజు చేయించారు. ఆ తర్వాత మళ్ళీ వేదిక ఎక్కి ప్రసంగించారు. అస్ర్ నమాజు వేళ అయ్యింది. వేదిక దిగి నమాజు చేశారు. మళ్ళీ వేదికపైకెక్కి సూర్యాస్తమయం వరకు ప్రసంగించారు. లోకంలో జరిగింది, జరగబోయేది అన్నీ మాకు తెలియపర్చారు". (ముస్లిం)

ఆయన ﷺ చెప్పిన భవిష్యవాణుల్లోని ఓ భవిష్యవాణి ఇది: హజ్రత్ అబూ హురైరా ﷺ కథనం ప్రకారం దైవప్రవక్త ﷺ ఇలా ప్రవచించారు- "దౌస్ తెగ స్త్రీలు 'జుల్ఖలస్త' విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేయనంతవరకూ ప్రళయం సంభవించదు. 'జుల్ఖలస్త' అనేది దౌస్ తెగ ప్రజల ఆరాధనా విగ్రహం. అజ్ఞాన కాలంలో వారు 'తిబాలా' అనే ప్రాంతంలో ఈ విగ్రహాన్ని పూజించేవారు. ఈ ప్రాంతం 'యమన్' దేశంలో ఉంది". (ముస్లిం)

(ఇంకా ఉంది)



సైదు - అబ్దుర్రహ్మాన్

నా అన్వేషణ ఫలించింది

"అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు"

నా పేరు అబ్దుర్రహ్మాన్. పూర్వాశ్రమంలో హిందువులైన నా తల్లి దండ్రులు నా బాల్యంలో క్రైస్తవ మతాన్ని ఆశ్రయించారు. నేను నా తల్లిదండ్రులను అనుసరించి వారి బాటలోనే సాగిపోయాను. 18 సంవత్సరాల వయస్సులో బైబిల్ చదవాలి, అవగాహన చేసుకోవాలన్న ఉత్సుకత నాలో మొదలయింది. నేను బైబిల్‌ను కొద్దిగా చదవడం, అర్థం చేసుకోవడం ప్రారంభించాను. యెహోవా ఒక్కడే దేవుడని, ఏసుక్రీస్తు దేవుని కుమారుడని , ఏసుక్రీస్తు ద్వారానే స్వర్గం సాధ్యమని, ఏసే సత్యం, ఏసే మార్గం, ఏసే స్వర్గం అని నమ్మి బాప్తిస్మం కూడా తీసుకున్నాను. అప్పుడు నాతో ఒక ప్రమాణం చేయించారు కూడా. అదేమంటే– యెహోవాయే నిజ దైవం అని, ఏసు క్రీస్తు దేవుని కుమారుడని, ఏసు క్రీస్తు పాప విమోచకుడని, ఏసే రక్షకుడని, విగ్రహారాధన చేయకూడదని, కనిపించే ప్రతిమల్ని మొక్కకూడదని.

ప. గోదావరి జిల్లాలోని కొల్లేటి సరస్సు తీరాన నున్న మా ఊరిలో హిందువులు, క్రైస్తవులు తప్ప ముస్లింలు లేరు. ఇక హిందువుల ఆరాధ్య దేవుళ్ల గురించి – వారు ముక్కోటి మందని అంటారు. కాని ఈ సిద్ధాంతం నాకు మింగుడు పడలేదు. విశ్వాన్ని, విశ్వంలో జీవకోటిని సృజించిన సృష్టికర్త ఒక్కడే అని, ఆయన యెహోవాయేనన్నది నా నమ్మకం. అప్పట్లో నాకు ముస్లింల గురించి అంతగా తెలియదు. ఒకట్రెండుసార్లు దర్గాలు, జెండా చెట్ల చుట్టూ తిరుగుతూ హైదరాబాదుకెళ్ళినప్పుడు చూశాను గనక, ముస్లింలంటే (నవూజుబిల్లాహ్ – అల్లాహ్ నన్ను క్షమించుగాక!) దర్గాలను, జెండా చెట్టులను పూజించేవాళ్ళేమో అన్న అభిప్రాయం నాకుండేది.

అలా సాగిపోయే నా జీవితంలో కువైట్ రాక ఓ కొత్త మలుపుకి నాంది పలుకుతుందని నేను కలలో కూడా అనుకోలేదు. చివరికి నేను కువైట్‌కి వచ్చాను. భారత దేశంలో మస్జిద్ ఎలా ఉంటుందో కూడా ఎరుగని నేను కువైట్‌లో ఎటు చూసినా మస్జిదులే ఉండటం చూసి కాస్తంత విస్తుబోయాను. అప్పుడే నాకు తెలిసింది. ముస్లింలంటే – ఒకే నిజ దైవాన్ని ఆరాధించేవాళ్ళని, 5 పూటలా నమాజు క్రమం తప్పకుండా చేసేవాళ్ళని, దర్గాలు జెండా మాను, పీర్ల పండగల్లాంటివి అసలు ఇస్లాంలోనే లేదన్న వాస్తవం అప్పుడే నాకు తెలిసింది. అయినా నాలో మార్పు మాత్రం రాలేదు. ఆ తర్వాత కొన్ని మాసాల తర్వాత నాకు కొందరు ముస్లిం స్నేహితులు పరిచయమయ్యారు. అలా పరిచయం అయిన వారిలో కొందరికి అటు క్రైస్తవం, హైందవం, ఇటు ఇస్లాం గురించి కొద్దోగొప్పో అవగాహన ఉన్నవారు కూడా ఉండటం నా అదృష్టంగానే భావిస్తాను. ముస్లింలకు ఏసుక్రీస్తు గురించి బొత్తిగా తెలియదేమో అనుకున్న నాకు, ఖుర్‌ఆన్ గ్రంథంలో ఆయన గురించిన ప్రస్తావన ఉందని తెలుసుకొని ఆశ్చర్యమేసింది. ముస్లింలు ఏసు క్రీస్తుని – ఈసా మసీహ్‌గా పిలుస్తారని, ఆయన కేవలం ఇతర ప్రవక్తల్లాంటి దైవప్రవక్త తప్ప మరేమీ కాదని మరో ముస్లిం స్నేహితుడు చెప్పినప్పుడు సంతోషంతోపాటు ఒకింత కోపం కూడా కలిగింది. ముహమ్మద్ ప్రవక్త (స) ప్రస్తావన బైబిల్‌లో ఉందని చెప్పినప్పుడు మరింత చిరాకు కూడా వేసింది.

ఆ క్షణం నుండి, ఇస్లాం గురించి తెలుసుకోవాలని, ఇస్లాం ఆదం నుండి మొదలు ఏసుక్రీస్తు వరకు వచ్చిన ప్రవక్తల గురించి ఏమంటుందో తెలుసుకోవాలని, ఈ ముహమ్మద్ ఎవరు? ఇస్లాం మూలాలేమిటో తెలుసుకోవాలన్న ఆరాటం మొదలయింది. ఆ తర్వాత ఎప్పటికో చాలా రోజులకుగానీ తత్సంబంధిత సమాచారాన్ని అందించే పుస్తకాలు లభించలేదు. చివరికి నా శ్రమ షేఖ్ ఖాదర్ బాషా అనే స్నేహితుడి రూపంలో ఫలించింది. **(ఇంకా ఉంది)**

వివేచన



సాదాసీదా ప్రభావం

స్నేహం
సృష్టిలో తీయనైనది స్నేహం.
త్యాగానికి ప్రతిరూపం స్నేహం.
ఉపకారానికి, శ్రేయోభిలాషకు మారు పేరు స్నేహం.
ఇచ్చిపుచ్చుకునేది స్నేహం. ప్రభావితం చేసేది స్నేహం
కష్టసుఖాలను పంచుకునేది స్నేహం.
ఓదార్పును, సాంత్వనను ఇవ్వగలిగేది స్నేహం.
స్నేహమే నాకం! స్నేహమే నరకం!
మనిషి తన స్నేహితుని జీవన శైలిని
సహజంగానే పుణికి పుచ్చుకుంటాడు.

అందుకే -

తాను ఎవరితో స్నేహం చేస్తున్నాడో ఒకటికిరెండు సార్లు ఆలోచించుకోవాలి. ఈ నేపథ్యంలో మహా ప్రవక్త (ﷺ) వారి ప్రవచనం మనందరికీ ఆదర్శప్రాయం. ఆయన (ﷺ) ఇలా ఉపదేశించారు:

"మంచి సావాసి ఉపవాసం అత్తరు అమ్మే వర్తకుని వంటిది. సహచర్యంలో తను మీకేమీ ఇవ్వకపోయినా కనీసం సుగంధ పరిమళమైనా గుభాళించగలదు. చెడు సావాసి ఉపమానం ఇనుమును కాల్చేవాని కొలిమి వంటిది. దాని ధూళి నుండి మిమ్మల్ని మీరు ఎంతగా కాపాడుకున్నా పొగ మాత్రం మిమ్మల్ని చుట్టుముట్టకమానదు". (అబూ దావూద్)



CAMS
معهد كامز للتدريب الأهلي
CENTRE FOR COMPUTER & MANAGEMENT STUDIES

الأمانة العامة للأوقاف

కువైట్ బొఖాఫ్ పబ్లిక్ ఫౌండేషన్ వారి
ఉదాత్త పర్యవేక్షణలో ఇస్లాం ప్రజెంటేషన్
కమిటీ, అన్ని బ్రాంచీలలో నిర్వహించే



అరబ్యేతరుల కొరకు అరబీ కోర్సు

01-09-2010 నుండి రిజిస్ట్రేషన్ మొదలు

అక్టోబరు మొదటి తేదీ వరకు మాత్రమే పేర్లు నమోదు చేసుకోబడతాయి. మొత్తం కోర్సు 32 గంటలు ఉంటుంది.

కోర్సు అనంతరం CAMS తరపున సర్టిఫికేట్ ఇవ్వబడుతుంది.

మీ సమీప బ్రాంచ్‌లో మీ పేరు నమోదు చేయించుకోండి

Hot Line: 94066743, 94066954

www.ipc-kw.com

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

رحمة للعالمين...

KPCC	Al mulla saleh	Salwa	Sharq	Aware Center	Rawda	Salimiyah	Farwaniyah	Almangaf	Al-Jahra
24712574	22444117	25637900	22418934	25335260	22511301	25733263	24735627	23723002	24558830
97802777	65159513	94064491	22418917	25335280	22512257	97533263	99868285	99256165	97509063
			94066743	97310826	97290278		99285459	99630946	67720696